ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

బుధవారం 4 జూన్ 2025



కోర్టులో గంగమ్మ జాతర ప్రారంభం

● అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠ

6



వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ జరుగుతుందని, వారు రేషన్ షాపుల వద్దకు రావాల్సిన అవసరం లేదని, జిల్లాలో మూడు రోజుల్లో వికలాంగులు, వృద్ధులకు 57.79 శాతం కార్డులకు రేషన్ సరుకుల పంపిణీ పూర్తయిందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1123 చౌకధరల దుకాణాలు, రేషన్‌కార్డులు 4,97,969 ఉన్నాయని, మొత్తం రేషన్ కార్డుల ద్వారా 14,82,094 మంది సభ్యులు రేషన్ ద్వారా లబ్ధి పొందనున్నారని పేర్కొన్నారు. ఇందులో 65 సంవత్సరాల పైబడిన కార్డుల సంఖ్య 57,707గా ఉందని, ఈ కార్డుల ద్వారా 69,336 మంది సభ్యులు లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. ఏక లేదా ద్విసభ్య కార్డులోని వారి వయస్సు 65 సంవత్సరాలపైబడిన వారికి దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు 12 గంటల నుంచి 4 గంటల మధ్య సమయంలో పంపిణీ చేస్తారని తెలిపారు. 65 సంవత్సరాలపైబడిన వృద్ధులు, దివ్యాంగులు రేషన్‌షాపులకు రావాల్సిన అవసరం లేదని రేషన్ డీలర్ వారి ఇంటి వద్దకు రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేస్తారని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి రాజంపేటలో

సంపర్క్‌క్రాంతికి స్టాపింగ్

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్



ఎస్‌సీఆర్ సీపీఆర్‌వో శ్రీధర్‌ను కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్

రాజంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పార్లమెంట్ కేంద్రం పరిసర ప్రాంతాల ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 15వ తేదీ నుంచి రాజంపేటలో స్టాపింగ్ ఇస్తున్నట్లు ఎస్‌సీఆర్ సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి నెలలోనే నిలుపుదలపై రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసినా కొన్ని సాంకేతిక కారణాల వల్ల అమలు కాకపోవడంతో తెలంగాణ రాష్ట్రంలోని సికింద్రాబాదులోని రైల్వే నిలయం వద్ద ఎస్‌సీఆర్ సీపీఆర్‌వో ఎ.శ్రీధర్‌ను కలిసి ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి ఈనెల 15వ తేదీ నుంచి నిలుపుదల అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



అరాచక పాలన నుంచి విముక్తికి

నేటితో ఏడాది

● ఐదేళ్లలో యథేచ్ఛగా వైసీపీ నేతల ఇసుక దందా
● పేదల భూముల ఆక్రమణలు
● చంద్రబాబుపై దాడికి యత్నం..
● నారా లోకేశ్ యువగళానికి అడ్డంకులు
● జిల్లాలో కూటమికి బ్రహ్మరథం..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాల వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించి నేటికి ఏడాది పూర్తయింది. అమలుకు సాధ్యం కాని హామీలతో పాటు ఒక్క అవకాశం ఇవ్వమని జగన్ అడగడంతో గతంలో ఎన్నడూ లేనట్టుగా 2019 ఎన్నికల్లో వైసీపీకి రాష్ట్ర ప్రజలు అఖండ విజయం కట్టబెట్టారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నాయకులు అడ్డూ అదుపు లేకుండా చెలరేగిపోయారు. ఐదేళ్ల పాటు జిల్లాలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టి బెంగళూరు, చెన్నైలకు తరలించి కోట్ల రూపాయలు దోచుకున్నారు. మట్టి, రాళ్లు, కంకర ఏదీ దోచుకోవడానికి అనర్హం అన్నట్లు అందినకాడికి దోచుకున్నారు. పేదల భూములను కాజేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమాలు చేసి.. ఫ్రీహోల్డ్ పేరుతో వేలాది ఎకరాలు దోచుకున్నారు. ఇదేందని ప్రశ్నించిన ప్రతిపక్షాలు, ప్రజలపై అక్రమ కేసులు బనాయించి వందల మందిని జైళ్లపాలు చేశారు. సాక్షాత్తు రాష్ట్ర ప్రతిపక్ష నేత చంద్రబాబుపైన వైసీపీ నాయకులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకు అడుగడుగునా పోలీసుల రూపంలో ఆంక్షలు పెట్టారు. వీటన్నింటి ఫలితమే గత ఎన్నికల్లో వైసీపీని ప్రజలు భూస్థాపితం చేశారు. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేనట్లు రాష్ట్రంలో గత ఏడాది జూన్ 4వ తేదీ జరిగిన ఎన్నికల కౌంటింగ్‌లో 175 అసెంబ్లీ సీట్లలో 164 తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి రాష్ట్ర ప్రజలు అఖండ విజయాన్ని కట్టబెట్టారు. జిల్లాలోనూ ఆరు అసెంబ్లీ స్థానాలలో నాలుగింటిలో కూటమిని గెలిపించారు.

యువగళానికి తీవ్ర అడ్డంకులు

నారా లోకేశ్ కుప్పం నుంచి యువగళం పేరుతో పాదయాత్రను ప్రారంభించారు. ఈ యాత్రకు జిల్లాలో పోలీసుల రూపంలో అడుగడుగునా ఆంక్షలు విధించారు. ప్రజలనుద్దేశించి మాట్లాడేందుకు కూడా ఆయనకు మైకు ఇవ్వలేదు. నిలబడి మాట్లాడేందుకు స్టూలు సైతం ఇవ్వలేదు. ఈ సంఘటనలు కూడా మేధావులు, తటస్థుల్లో అప్పటి వైసీపీ ప్రభుత్వంపైన వ్యతిరేకతకు ప్రధాన కారణంగా నిలిచాయి.

తవ్వుకో.. అమ్ముకో..

వైసీపీ ఐదేళ్ల పాలనలో గల్లీ నుంచి ఎమ్మెల్యేల వరకు ఇసుకను తవ్వుకో.. అమ్ముకో అని చెలరేగిపోయారు. ఎటువంటి భయం లేకుండానే వందల టన్నుల ఇసుకను డంపు చేసి మరీ పక్క రాష్ట్రాలకు అమ్ముకున్నారు. జిల్లాలోని ప్రముఖ నదులతో పాటు వాగులు, వంకలను సైతం ఇసుక కోసం చెరపట్టారు. ఐదేళ్లలో కనీసం 4 వేల కోట్ల రూపాయలు ఇసుక ద్వారానే వైసీపీ నాయకులు దోచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా జిల్లాలోని పలు కొండలు, గుట్టలను ఎర్రమట్టి కోసం అక్రమంగా తవ్వేసి కోట్లాది రూపాయలు సంపాదించారు.

లెక్కలేని భూముల అక్రమాలు

జిల్లాలో ఐదేళ్ల వైసీపీ పాలనలో భూముల అక్రమాలు లెక్కనేనన్ని జరిగాయి. ప్రత్యేకించి మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలలో వైసీపీ నాయకులు పేదల భూములు అక్రమించారు. పలుచోట్ల ఎంతో విలువైన భూములను సైతం నామమాత్రపు ధరలకు దౌర్జన్యంగా లాక్కున్నారు. ఫ్రీహోల్డ్ పేరుతో వేలాది ఎకరాలు అక్రమంగా తమ సొంతం చేసుకున్నారు. అటవీ భూములు దర్జాగా ఆక్రమించారు. ఈ అక్రమాలు వెలుగులోకి వస్తాయనే.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విలువైన ఫైళ్ల దహనం చేశారు. వీటితో పాటు ఎందరిపైనో అక్రమ కేసులు బనాయించారు. వలంటీర్లను అడ్డం పెట్టుకుని ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించారు. అయినా... 2019 ఎన్నికల్లో వైసీపీకి తిరుగులేని మెజార్టీని కట్టబెట్టిన జిల్లా ప్రజలు.. 2024లో వైసీపీకి దిమ్మతిరిగేలా తీర్పునిచ్చారు.

చంద్రబాబుపై రాళ్ల దాడులు

2023 ఆగస్టు 4 అప్పటి ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబునాయుడు జిల్లాలో ప్రాజెక్టుల సందర్శనకు వచ్చారు. అయితే అంగళ్లులో వైసీపీ నాయకులు చంద్రబాబు పర్యటనను అడ్డుకున్నారు. సాక్షాత్తు అప్పటి పోలీసుల సహకారంతో చంద్రబాబుపైన రాళ్ల దాడికి యత్నించారు. ఆయన భద్రతా సిబ్బంది అప్రమత్తతతో ఆయనకు ప్రమాదం తప్పింది. దాడులకు పాల్పడింది వైసీపీ నాయకులు అయితే.. విచిత్రంగా చంద్రబాబుతో సహా సుమారు 40 మందికి పైగా రాష్ట్ర, జిల్లా స్థాయి టీడీపీ నాయకులపైన హత్యాయత్నం వంటి తీవ్ర ఆరోపణలతో కేసులు నమోదు చేశారు. తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాలకు చెందిన దాదాపు 700 మంది తెలుగుదేశం పార్టీ క్రియాశీల కార్యకర్తలు, నాయకులపైన అక్రమ కేసులు బనాయించి 45 రోజులు జైలుపాలు చేశారు. సాక్షాత్తు రాష్ట్ర ప్రతిపక్ష నేతకే రక్షణ కల్పించకుండా.. ఆయనపైనే అక్రమ కేసులు బనాయించడంతో ఇక తమ పరిస్థితి ఏంటనే ఆలోచన సామాన్యుల్లో ఏర్పడింది.





అంగళ్లులో చంద్రబాబుపైన వైసీపీ నాయకుల దాడి (ఫైల్)

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

● బోధనలో నూతనత్వం అవసరం
● జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యంరెడ్డి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని, బోధనలో నూతనత్వంతో మెరుగైన ఫలితాలను సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం సూచించారు. మంగళవారం స్థానిక డైట్ విద్యా కేంద్రంలో ప్రారంభమైన డిస్ట్రిక్ రీసోర్స్ పర్సన్‌ల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో అకడమిక్ క్యాలెండర్ ప్రకారం విద్యా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అందుకోసం అకడమిక్ క్యాలెండర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాల స్థాయిలో నిర్వహించే అన్ని పరీక్షలకు ఒక్కొక్క సబ్జెక్టుకు ఒక మూల్యాంకన పుస్తకాన్ని విద్యార్థులకు అందిస్తామని తెలిపారు. అందులోనే విద్యార్థులు సమాధానాలను రాయాల్సి ఉంటుందన్నారు. పాఠ్యపుస్తకాల్లోని కఠిన భావనలపై అవగాహన పెంపొందించుకునేందుకు ఉపాధ్యాయుల కరదీపిక తోడ్పడుతుందన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించేందుకు లీప్ యాప్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్స్ అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ రీసోర్స్ పర్సన్ సుజన్, డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ బాబు, ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, డీసీఈబీ కార్యదర్శి నాగమునిరెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, జిల్లాలోని 274 మంది తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘీక శాస్త్రం సబ్జెక్టుల రీసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ జగన్‌రెడ్డి

● ఆస్తి కోసం తల్లికి, చెల్లికి వెన్నుపోటు.. బాబాయిపై గొడ్డలి వేటు
● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ పేటెంట్ రైట్ ఉన్న ఏకైక వ్యక్తి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఘాటుగా విమర్శించారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెన్నుపోటు అంటే జగన్‌రెడ్డికి అన్ని హక్కులు ఉన్నాయని, ఎందుకంటే ఆస్తికోసం తల్లి, చెల్లిని కోర్టుకు ఈడ్చి వెన్నుపోటు పొడిచారని, సొంత బిడ్డలా చూసుకున్న బాబాయ్‌ని గొడ్డలిపోటుతో కడతేర్చారని తెలిపారు. తన స్వార్థం కోసం తనను నమ్ముకున్నవారిని అధికారులను జైలుకు పంపేలా అవినీతితో వెన్నుపోటు పొడవడం, అధికారం కోసం నిరుద్యోగులకు మెగా డీఎస్సీ అంటూ వెన్నుపోటు పొడవడం, మద్యనిషేదం అంటూ మహిళలకు వెన్నుపోటు పొడిచి మద్యం ద్వారా వేల కోట్లు అవినీతి చేయడం ఆయనకే సాధ్యమైందన్నారు. నమ్మి ఓట్లు వేసిన రాష్ట్ర ప్రజలకు, రాజంపేట ప్రజలకు వెన్నుపోటు పొడిచి అన్నమయ్య డ్యాంను నిర్మించకుండా కాలయాపన చేయడం ఇలా లెక్కలేనన్ని వెన్నుపోట్లకు జగన్‌రెడ్డిదే పేటెంట్ అన్నారు. ప్రజల చేతుల్లో ఘోర ఓటమిని రుచి చూసి నేడు ప్రజా పాలనను ఎదుర్కోలేక వెన్నుపోటు అంటూ ప్రజల దృష్టిని మరల్చడానికి మరో వింత నాటకానికి తెరలేపారని ఆయన ఎద్దేవా చేశారు. సమావేశంలో నందలూరు మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, కొల్లు రెడ్డెయ్యనాయుడు, నేతలు గీతాంజలి రమణ, పసుపులేటి ప్రవీణ్‌కుమార్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, వెంకటసుబ్బయ్య, నరసింహ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

7న అన్నమయ్య విగ్రహం వద్ద యోగాంధ్ర

● కలెక్టర్ శ్రీధర్

రాజంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద ఈనెల 7న అత్యంత వేడుకగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెలలో అన్నమాచార్యుల 617 జయంతి ఉత్సవాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనను స్మరిస్తూ 108 అడుగుల విగ్రహం వద్ద ఈనెల 7వ తేదీ శనివారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు 617 మందితో యోగాసనాలు వేయనున్నట్లు తెలిపారు. యోగా కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిన జగన్

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని జగన్ అప్పుల పాలు చేసి ఊబిలో ముంచేశారని, అందుకే ఎన్నికల్లో చతికిలపడ్డారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి రాజధాని నిర్మాణం ఆపేసి మూడు రాజధానులు అంటూ తుగ్లక్ ప్రయోగాలు చేశాడని, ఇదేమైనా పాలనా, ల్యాబ్ టెస్టా అనేలా ఉందన్నారు. బాబాయ్ గొడ్డలి పోటుకు న్యాయం చెప్పలేని వ్యక్తి రాష్ట్రానికి న్యాయం చేస్తాడా అని కుటుంబమే నమ్మడం లేదన్నారు. తల్లిని, చెల్లిని దూరం పెట్టి బాబాయ్‌కి న్యాయం చేయని వ్యక్తి రాష్ట్రం పట్ల నిజాయితీగా ఉంటాడా అనే ప్రశ్నకు సమాధానం ప్రజలే చెబుతారన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి

6



నాటుసారా రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

● నాటుసారాపై 14405 టోల్‌ఫ్రీ నెంబర్
● కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, పాల్గొన్న అధికారులు

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాను నాటుసారా రహితంగా మార్చడమే లక్ష్యంగా సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నాటుసారా నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటుసారా అమ్మడం, తయారు చేయడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఇందుకు జైలు శిక్షతో పాటు జరిమానా కూడా ఉంటుందన్నారు. జిల్లాలో ముఖ్యంగా గిరిజన తాండాలు ఉన్న మండలాల్లో నాటుసారా తయారు చేస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. జిల్లాలో మొత్తంగా నాటుసారా తయారు చేసే 68 గ్రామాలను గుర్తించగా, ఇందులో ఏ-కేటగిరిలో ఆరు గ్రామాలు, బీలో 32, సీ-కేటగిరిలో 30 చొప్పున గ్రామాలు ఉన్నట్లు ఎక్సైజ్ శాఖ వారు గుర్తించారన్నారు. ఇందులోని 40 గ్రామాల్లో నాటుసారాను పూర్తిగా అరికట్టామని, ఇంకా 28 గ్రామాల్లో నాటుసారా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. నవోదయం 2.0 కార్యక్రమం అమలైనప్పటి నుంచి ఇప్పటి వరకు 191 కేసులు నమోదు చేయగా, 169 మందిని అరెస్టు చేశారని, 11224 లీటర్ల నాటుసారా సీజ్ చేయడంతో పాటు 35675 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే 525 మందిని బైండోవర్ చేశారని, 9 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. నాటుసారా వృత్తి నుంచి బయటికి రాని వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని, అలాగే ఆ వృత్తిలో ఉన్న వారు బయటికి వచ్చేలా కళాజాత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నాటుసారాపై 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదులు చేయవచ్చునని, ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ తెలిపారు. అంతకుముందుగా నవోదయం 2.0 కార్యక్రమం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను జిల్లా ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ మధుసూదన్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో వివరించారు. ముఖ్యంగా వాల్మీకిపురం, మదనపల్లి, పీలేరు, ములకలచెరువు, కోడూరు మండలాల్లోని గిరిజన తాండాలు అటవీ ప్రాంతాల్లో నాటుసారా తయారు చేస్తున్నారని, వీరిపై ఎక్సైజ్, అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖల ద్వారా ప్రత్యేకమైన పర్యవేక్షణ చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. సమావేశంలో ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు, సూపరింటెండెంట్ వై.జోగేంద్ర, ఎల్డీయం, పోలీసు, డ్వామా, డీఆర్‌డీఏ, బీసీ, ఎస్టీ, పంచాయతీ, అటవీశాఖల అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

అక్కడ స్మగ్లర్‌దే పెత్తనం..?

● తల్లికి బదులు 16 కేసుల్లో నిందితుడిగా ఉన్న కొడుకు వీఆర్‌ఏగా విధులు
● ప్రతిరోజు తహశీల్దారు, ఆర్ఐ ఎదుట కూర్చుని ముచ్చట్లు
● ఎవరికి ఏ పనికావాలన్నా తను ఓకే అంటే చాలు..



తహశీల్దారు కార్యాలయంలో ఆర్ఐ ఎదుట కూర్చున్న అనధికార వీఆర్ఏ

మండల స్థాయిలో రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారుదే పెత్తనం ఉంటుంది. కానీ పుల్లంపేట తహశీల్దారు కార్యాలయంలో మాత్రం 16 కేసుల్లో ఎర్రచందనం స్మగ్లర్‌గా ఉన్న వ్యక్తిదే పెత్తనం. ఇతను అనధికారికంగా వీఆర్‌ఏగా ఇక్కడ పనిచేస్తున్నాడు. రోజూ తహశీల్దారు కార్యాలయానికి వచ్చి..తహశీల్దారు లేదా ఆర్ఐ ఎదురుగా కుర్చీలో కూర్చుని ఉంటాడు.కొత్తవాళ్లు ఎవరైనా వచ్చారంటే తహశీల్దారు ఇతనేనేమో అనేంత దర్జా ఒలకబోస్తుంటాడు. అధికారులకు, అక్రమార్కులకు మధ్యవర్తిగా ఉండటంతో ఈ తహశీల్దారు కార్యాలయంలో ఇతను చెప్పిందే వేదం. ఎంతలా అంటే.. స్వయంగా ఇతడి బంధువుల పేరుతో 40 ఎకరాలకు పైగా అధికారులు ఆన్‌లైన్ చేసేంతగా..!

వివరాలు 6లో..

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుమారి

రామాపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు 40వ జాతీయ రహదారిపై మంగళవారం కంభంపాటి కుమారి (32) మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గాలివీడు మండలం కమలాపురానికి చెందిన కంభంపాటి కుమారి మంగళవారం తమ తల్లిగారి ఊరైన రామాపురం మండలం నీలకంఠ్రావుపేట పంచాయతీ గాండ్లపల్లికి ఏపీ04 టీఎక్స్ 8555 నెంబరు గల రాయచోటి డిపోకు చెందిన హైయిర్ బస్సులో బయలుదేరారు. దర్గా రోడ్డు బస్‌స్టాప్ వద్ద బస్సు దిగుతుండగా బస్సు ఒక్కసారి కదలడంతో ఆమెపై రెండు టైర్లు ఎక్కాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. కాగా ఈమెకు గాలివీడు మండలం కమలామర్రి గ్రామంలో 2010లో రెడ్డెప్పతో వివాహమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడు ..


నారాయణ మృతదేహం

కలకడ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె లక్ష్మీనగర్‌కు చెందిన నారాయణ (60) ఎర్రయ్యగారిపల్లెలోని బంధువుల ఇంటికి వచ్చి, తిరిగి బస్టాండుకు నడిచి వెళ్లుతుండగా ఎర్రగుంట్ల నుంచి చిత్తూరు వెళుతున్న లారీ.. ముందు వెళ్లుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసే సమయంలో ఆయనను ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న వెంకటమ్మ

సిద్దవటం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థులు మెరుగైన వైద్యసేవల కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... భాకరాపేట గ్రామానికి చెందిన భార్యాభర్తలు నల్లగొండ చెన్నయ్య, వెంకటమ్మ సోమవారం రాత్రి శివాలయం వద్ద హైవే రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. చెన్నయ్య తలకు బలమైన గాయం కాగా, వెంకటమ్మ ఎడమకాలు పూర్తిగా విరిగిపోయింది. వైద్యసేవల కోసం సోమవారం రాత్రి అంబులెన్స్‌లో కడప రిమ్స్‌కు తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ మేరకు సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ ఢీకొన్న వాహనం ఆచూకీ సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నామని, హైవేరోడ్డు దాటేప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండి వాహనాల రాకపోకలు గమనించి రోడ్డు దాటాలని తెలిపారు.

పంట పొలాలపై రైతులకు అవగాహన


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

చిన్నమండెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్, ఉద్యానవాధికారి రవీంద్రబాబు మంగళవారం నిర్వహించారు. వికసిత్ కృషి, సంకల్ప అభియాన్ కింద కేవీకే ఊటుకూరు వారి ఆధ్వర్యంలో చిన్నమండెం, బోరెడ్డిగారిపల్లె గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవణాధికారి వనితాభాయి, ఏవో గీత, శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, జిల్లా వ్యవసాయాధికారి సుచిత్ర, 150 మంది రైతులు పాల్గొన్నారు.

అక్కడ స్మగ్లర్‌దే పెత్తనం..?


అనధికార వీఆర్ఏకు ఆన్‌లైన్ చేసి కట్టబెట్టిన ప్రభుత్వ భూమిలో సాగు చేసిన మామిడితోట

- తల్లికి బదులు 16 కేసుల్లో నిందితుడిగా ఉన్న కొడుకు వీఆర్ఏగా విధులు
- ప్రతిరోజు తహశీల్దారు, ఆర్ఐ ఎదుట కూర్చుని ముచ్చట్లు
- ఎవరికి ఏ పనికావాలన్నా తను ఓకే అంటే చాలు..

పుల్లంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పుల్లంపేట తహశీల్దారు కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. గతంలో ఇక్కడ పనిచేసిన తహశీల్దారులంతా కోట్లకు పడగలెత్తారని కిందిస్థాయి సిబ్బందితో పాటు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూములు అక్రమార్కులకు ఆన్‌లైన్ చేసి కోట్ల రూపాయలు దండుకున్నారు. డీకేటీ భూముల అమ్మకంలో లబ్ధిదారుల పేర్లు మార్చేందుకు లక్షల్లో వసూలు చేశారని బాహాటంగా చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ఈ తహశీల్దారు కార్యాలయం గంజాయి, ఎర్రచందనం స్మగ్లర్లకు అడ్డాగా మారింది. వీరి ద్వారానే కోట్లాది రూపాయల లావాదేవీలు, డీకేటీ భూములకు సంబంధించి యజమానుల పేర్లు మార్పు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మారినా తహశీల్దారు కార్యాలయంలో మాత్రం ఇప్పటికీ స్మగ్లర్లే రాజ్యమేలుతున్నారు.

16 ఎర్రచందనం కేసుల్లో ఉన్నా..

పుల్లంపేట గ్రామ రెవెన్యూ విలేజ్‌లో వీఆర్ఏగా పనిచేస్తున్న మహిళ తనకు ఆరోగ్యం సరిగా లేదని, కుమారునికి విధులు అప్పజెప్పారు. అయితే అతను 16 ఎర్రచందనం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసుల్లో జైలుకు వెళ్లిన అతను ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు. వీఆర్ఏ అంటే తహశీల్దారు కార్యాలయంలో అన్నిటి కంటే చిన్న ఉద్యోగం ఇదే. అయితే ఇతను మాత్రం పుల్లంపేట తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు కంటే పెద్ద అని చెప్పుకోవచ్చు. రోజూ ఆఫీసుకు రావడం.. తహశీల్దారు ఎదుట లేదా ఆర్ఐ ఎదుట కుర్చీలో దర్జాగా కూర్చుని గంటల తరబడి మాట్లాడుతూ ఉంటాడు. తహశీల్దారు కార్యాలయంలో ఇతను అనుకుంటే జరగని పని ఉండదు. గతంలో పనిచేసిన తహశీల్దారుకు, ఇప్పుడు పనిచేస్తున్న రెవెన్యూ అధికారులందరికీ ఈ అనధికార వీఆర్ఏ సకల సౌకర్యాలు కల్పిస్తూ పనులు చేయించుకుంటున్నాడని అంటున్నారు. రెవెన్యూ అధికారులకు, అక్రమార్కులకు ఇతను మధ్యవర్తిగా ఉంటున్నాడని.. అందుకు ప్రతిఫలంగా అధికారులు ప్రభుత్వ భూములను అతనికి కట్టబెట్టేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతను గత ఆరేళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నాడు.

ఇవీ ఉదాహరణలు..

అనధికార వీఆర్ఏగా వ్యవహరిస్తున్న ఈ ఎర్రచందనం స్మగ్లర్ నిబంధనలకు విరుద్ధంగా తిరుపతి-కడప హైవే పక్కన కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల పక్కనే సుమారు ఐదెకరాల భూమిని స్వాధీనం చేసుకుని చుట్టూ కంచె వేసి ఎస్టేట్‌లాగా మార్చుకున్నాడు. అధికారులు సైతం వీఆర్ఏ బంధువుల పేర్లతో నాలుగు ఎకరాలు ఆన్‌లైన్ చేసేశారు. ఆన్‌లైన్ చేయడంతో ఆ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుని బోరు వేసి డ్రిప్ ద్వారా మామిడితోట సాగు చేస్తున్నాడు. రంగంపల్లె రెవెన్యూ విలేజ్‌లో సర్వే నెంబరు-522లో బంధువుల పేర్లతో సుమారు 40 ఎకరాలకు పైగా ఆన్‌లైన్ చేశారని సమాచారం. రెవెన్యూ అధికారులకు ఎంతగా దోచిపెట్టి సౌకర్యాలు కల్పించకపోతే అన్ని ఎకరాల ప్రభుత్వ భూములు అతడికి ఆన్‌లైన్ చేసి కట్టబెడతారని పలువురు విమర్శిస్తున్నారు.

విజిలెన్స్ విచారణ చేపట్టాలి


పుల్లంపేట చౌకదుకాణం-2 ప్రారంభోత్సవంలో టీడీపీ నాయకులతో పాటు తహసీల్దార్, ఎర్రచందనం స్మగ్లర్ పోలి రవి


ప్రభుత్వ భూమి ఆన్‌లైన్ కావడంతో బోరు వేసి ట్రాన్స్‌ఫార్మర్, పైపులైను ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రభుత్వం మారినా రెవెన్యూ అధికారుల తీరు మారడం లేదని, అవినీతికి దాసోహం అయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు విచారణ చేపడితే ప్రభుత్వ భూములు ఎంతమేర ఆక్రమణకు గురయ్యాయి, అధికారులు ఎన్ని ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్ చేశారు, డీకేటీ భూముల అమ్మకం విషయంలో లబ్ధిదారుల పేర్లు మార్చడం ద్వారా ఎన్ని కోట్ల రూపాయలు చేతులు మారాయో వెలుగుచూసే అవకాశం ఉంది. ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు వస్తున్నా పుల్లంపేటలో పనిచేసే రెవెన్యూ అధికారులు దీనిని ఏమాత్రం లెక్కచేయడం లేదని తెలుస్తోంది.

ఎర్రచందనం స్మగ్లర్ అనధికారికంగా వీఆర్ఏగా పనిచేయడంపై తహశీల్దారు అరవింద కిశోర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. తనకు ఆరోగ్యం సరిగా లేదని తన కుమారుడిని విధులకు పంపుతున్నామని వీఆర్ఏ చెప్పడంతో ఒప్పుకుని పని చేయించుకుంటున్నామన్నారు. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో అతని చేతే పని చేయించుకుంటున్నామని, ఎర్రచందనం స్మగ్లర్ అయితే ఏమి? మా ఆఫీసులో స్మగ్లింగ్ చేసేది ఏమీ లేదని అనడం గమనార్హం.

ఉపాధి ఏపీవోపై ఎమ్మెల్యే ఆగ్రహం

- వెంటనే సెలవుపై వెళ్లాలని ఆదేశం


కేవీ పల్లె మండల పురోగతిపై సమీక్షిస్తున్న కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కూలీలకు అవసరమైన స్థాయిలో పనులు కల్పించలేనప్పుడు ఉద్యోగాలు చేయడం ఎందుకని, కేవీ పల్లె మండలం ఉపాధి హామీ పనుల్లో జిల్లా స్థాయిలో చివరి స్థానానికి చేరడం సిగ్గుచేటని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతమైన పీలేరులో 45 వేల పనిదినాలు కల్పించగా జిల్లాలో అతి పెద్దదైన వెనుకబడిన మండలం కేవీ పల్లెలో కేవలం 16 వేల పనిదినాలు కల్పించడంతో ఉపాధి హామీ సిబ్బంది తీవ్ర అలసత్వాన్ని చూపిస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం నగరిపల్లెలో కలికిరి, కలకడ, గుర్రంకొండ, పీలేరు, వాల్మీకిపురం, కేవీ పల్లె మండలాలకు సంబంధించిన ఉపాధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించిన సందర్భంగా ఆయన అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మండలం వారీగా ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీవో, ఏపీవోలతో విడివిడిగా సమస్యల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏపీవో నాగరాజు పనితీరుపై వస్తున్న విమర్శలను ఎమ్మెల్యే ప్రధానంగా ప్రస్తావించారు. జిల్లాలో అత్యధికంగా కూలీలున్న మండలం కేవీ పల్లెలోనే పురోగతి లేకుంటే ఇక అధికారులు పేదలకు ఎలా న్యాయం చేస్తారని నిలదీశారు. వెంటనే సెలవు పెట్టి వెళ్లిపోవాలని ఏపీవోను ఆదేశించారు. ఉన్నతాధికారులు కూడా ఇలాంటి వారిపట్ల ఉదాసీనంగా వ్యవహరించడం బాధ్యతగా లేదని విమర్శించారు. మిగిలిన మండలాల్లో అధికారులు అందజేసిన నివేదికలు కాస్త సంతృప్తికరంగా వుండటంతో కూలీ సంఖ్య ఇంకా పెంచాలని సూచించారు. సీసీ రోడ్లు, గోకులాలకు బిల్లులు పెండింగ్‌లో పెట్టకుండా పనులు పూర్తి చేయించాలని సూచించారు. కూలీలకు ఇబ్బంది లేకుండా పనులను పెంచుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కలికిరి క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసులు, ఆయా మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు ఎస్.మనోహర్ రాజు, ఎల్.సునీల్‌కుమార్ (వాల్మీకిపురం), జి.శివశంకర్, ఎం.అశోక్‌రెడ్డి (పీలేరు), సుధాకర్, నాగరాజు (కేవీ పల్లె), భానుమూర్తి, మంజుల (కలికిరి), కె.వెంకటేశులు, కె.జయరామిరెడ్డి (గుర్రంకొండ), అబ్దుల్ కరీం, డి.సుజాత (కలకడ)లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు తీపి కబురు

ఇదిలా వుండగా తాజాగా అందిన సమాచారం మేరకు గత రెండు నెలలుగా కూలీలకు చెల్లించాల్సిన వేతన బకాయిల కోసం మంగళవారం రాష్ట్రానికి రూ.1029.55 కోట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు పెండింగ్‌లో వున్న మెటీరియల్ బిల్లులతో పాటు కూలీలకు చెల్లించాల్సిన బకాయిలకు కూడా మోక్షం కలగనుంది. పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయడానికి చెల్లింపుల కోసం సిద్ధం చేయాలని డ్వామా కార్యాలయానికి వర్తమానం అందింది. రెండు నెలలుగా కూలీల వేతనాలు పేరుకుపోతున్న కారణంగా పనులు ప్రారంభించడానికి ఆటంకంగా వుందని చెబుతున్న అధికారులు బకాయిల విడుదలకు సంబంధించిన సమాచారం ఉపశమనం కలిగించిందని చెబుతున్నారు.

కోర్టులో గంగమ్మ జాతర ప్రారంభం

- అమ్మవారి భారీ విగ్రహ ప్రతిష్ఠ

మదనపల్లె అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోర్టులో గంగమ్మజాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఉదయాన్నే అమ్మవారికి విశేషంగా పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. పట్టణంలోని శాస్త్రివీధికి చెందిన రాటకొండ బాబురెడ్డి ఇంటి నుంచి కల్లు, కమ్మర భాస్కర ఇంటి నుంచి గంగమ్మ మట్టి ప్రతిమ, జోలపాళెం భవానీ ప్రసాద్ ఇంటి నుంచి చీర, పసుపు, కుంకుమ, సారె తెచ్చారు. సాయంత్రం ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ఆరు అడుగుల ఎత్తైన గంగమ్మ ప్రతిమను ప్రతిష్ఠించారు. అనంతరం మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్ జోలపాళెం భవానీప్రసాద్, జోలపాళెం దేవేంద్ర తొలిపూజ నిర్వహించారు. జోలపాళెం వంశస్థుల ఆడబిడ్డగా అవతరించిన గంగమ్మకు పుట్టింటివారు తొలిపూజ చేయడం ఆనవాయితీ. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పట్టణంలోని మహిళలు అమ్మవారికి దివ్వెలు, బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. బెంగళూరు రోడ్డు, అమ్మినేనివీధి, కోర్టువీధి, పటేల్‌రోడ్డు, డాక్టర్ కజ్జన్‌వీధి, కదిరిరోడ్డుల్లో విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, ట్రెజరర్లు రంగస్వామినాయుడు, కరుణాకర్‌నాయుడు, మహేష్, విక్కీ, మల్లికార్జున నాయుడు, శ్రీనివాస్ పర్యవేక్షించారు.



విశేషంగా అలంకరించిన కోర్టులో గంగమ్మ ఆలయం, ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి


దాడిలో గాయపడ్డ ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహారావు, తండ్రి పిచ్చయ్య

రాజంపేటటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులకు హాజరు కాకపోయినా వేతనం వచ్చేలా చేయాలని వేధంచేవారని, వారి మాట వినకపోవడంతో తాను, తన తండ్రిపై కొందరు దాడి చేసినేట్లు శవనవారిపల్లె ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మలగాసి నరసింహారావు మంగళవారం మన్నూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... సోమవారం రాత్రి 10 గంటల సమయంలో గ్రామానికి చెందిన లింగం రాజా, లింగం దుర్గయ్య, లింగం హరిబాబు, నారాయణ, అరవింద్, కొంత మందితో కలిసి ఇంటిలో ఉన్న సమయంలో తనపై, అడ్డు వచ్చిన తన తండ్రిపై కూడా దాడిచేసి ఇంటిలోని వస్తువులను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ ఘటనను బాధితుడు శక్తియాప్‌లో చిత్రీకరిస్తుంటే దౌర్జన్యంగా సెల్‌ఫోన్‌ను లాక్కొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. గత కొన్నిరోజులుగా ఉపాధి హామీ పనులకు రాకపోయినా వేతనం వచ్చేలా చేయాలని వేధించేవారని, అందుకు నిరాకరించడంతో తనపైకి దాడికి దిగినట్లు బాధితుడు తెలిపారు. తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడినవారు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

దాడిలో గాయపడిన వృద్ధుడు


చికిత్స పొందుతున్న వృద్ధుడు

మదనపల్లె అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మహిళను హింసిస్తున్నాడని అడ్డుకొన్నందుకు రాడ్‌తో కొట్టి గాయపర్చిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు సోమవారం రాత్రి మదనపల్లె మండలం, మొలకలదిన్నెకు చెందిన రెడ్డెమ్మ భర్త హరిబాబు నాలుగేళ్ల క్రితం ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆమె తన ముగ్గురు పిల్లలతో కలసి ఉంటోంది. ఈ నేపథ్యంలో తన కోరిక తీర్చాలంటూ సమీప బంధువు ఆమెను వేధించేవాడు. ఇందుకు నిరాకరించిన ఆమెపై మంగళవారం విజయభాస్కర్, మరికొంత మంది కలిసి దాడి చేశారు. అడ్డుకున్న రమణయ్య(55)ను రాడ్‌తో కొట్టి గాయపరిచారు. స్థానికులు అతన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నిత్యపూజయ్యా... ఇదేందయ్యా...!

- నిత్యపూజేశ్వర కోనలో వసతులు నిల్ • పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

సిద్దవటం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దట్టమైన లంకమల అభయారణ్యంలో ఎత్తైన కొండ కోనల్లో కొలువుదీరిన నిత్యపూజేశ్వర స్వామి ఆలయంలో వద్ద వసతులు కరువయ్యాయి. రహదారి సరిగా లేక భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. మండలంలోని వంతాటిపల్లె సమీపంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వర కోనకు ప్రతి సోమవారం కడప నగరంతో పాటు అట్లూరు, గోపవరం, మాధవరం, బద్వేల్, వేంపల్లె, ప్రొద్దుటూరు, మైదుకూరు, పోరుమామిళ్ల తదితర గ్రామాల నుంచి భక్తులు శివపార్వతుల దర్శనం కోసం వస్తుంటారు. మహాశివరాత్రి రోజున ఉమ్మడి కడప జిల్లా, ఇతర జిల్లాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. స్వామివారి సన్నిధానానికి వెళ్లే మార్గంలో రహదారికి అడ్డంగా పెద్ద పెద్ద గుండ్లు, వృక్షాలు ఉండడంతో భక్తులకు తీవ్ర ఇక్కట్లు తలెత్తాయి. భక్తులు తాగే మంచినీటి గుండాల్లో అపరిశుభ్రత ఏర్పడి దుర్వాసన వెదజల్లుతోంది. మహిళలకు మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యపూజకోనకు వచ్చే భక్తులు ఇచ్చే కానుకలు లక్షల్లో వస్తున్నా మౌలిక వసతులు కల్పించడంలో ఎండోమెంట్ శాఖ పూర్తిగా విఫలమైందని పలువురు పేర్కొంటున్నారు. సన్నిదానికి వెళ్లే మెట్ల మార్గం పాక్షికంగా దెబ్బతినడంతో మోకాళ్ల మీద దర్శనానికి వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

మహిళలకు వసతులు కల్పించాలి



నిత్యపూజకోనలో మహిళా భక్తులు వసతులు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. బట్టలు మార్చుకోవడానికి సరైన వసతి లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. వెంటనే ఎండోమెంట్ ఒక గది ఏర్పాటు చేయాలి.

- లక్ష్మీదేవి, భక్తురాలు, కడప


మహిళలు దుస్తులు మార్చుకునే షెడ్డు దుస్థితి


అలంకరణలో నిత్యపూజేశ్వరస్వామి - అపరిశుభ్రంగా ఉన్న కోనలోని మంచినీటి గుండం

రహదారిని బాగు చేయాలి



నిత్యపూజ కోనకు వెళ్లే రహదారిని బాగు చేయాలి. కాలినడకన వెళ్లే భక్తులకు పెద్ద పెద్ద గుండ్లు, వృక్షాలు, ఉండడంతో వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులు రహదారిని అభివృద్ధి చేసి సౌకర్యంగా ఉండేలా చూస్తే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

- శంకరయ్య, సిద్దవటం

కేసీ నీటికి అడ్డుకట్ట

● ప్లాట్ల వ్యాపారం కోసం రోడ్డుమీదకు మళ్లింపు ● బీడువారుతున్న పంట పొలాలు



కేసీ ఉపకాలువ నీటిని
రోడ్డు పక్కకు మళ్లించిన దృశ్యం

దువ్వూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కొందరి వ్యక్తుల స్వార్థంతో రోడ్డును ఆనుకుని ఉన్న స్థలం, పొలాన్ని వ్యాపారం కోసం ఉపయోగిస్తూ దిగువ ఉన్న పొలాలకు తాగునీరు వెళ్లకుండా అడ్డుపడుతున్నారు. దీంతో దిగువ ఉన్న పంట పొలాలకు సాగు నీరు అందక బీడు భూములుగా మారుతున్నాయి. ఈ నీళ్లు రోడ్డు వెంబడి ప్రవహిస్తుండడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ వ్యవహారం కొనసాగబట్టి అయిదేళ్లు దాటినా.. అడిగేవారు లేకపోవడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. వివరాల్లోకి వెళ్లితే..

దువ్వూరులో పోలీసుస్టేషన్ ఎదురుగా రహదారి పక్కనే పడమర వైపున కేసీ ఆయకట్టు పొలాలు ఉన్నాయి. బ్రిటీష్ హయాం నుంచి కేసీ కాలువకు తూములను ఏర్పరచి ఉప కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నారు. ఇక్కడ కొందరు వ్యక్తులు వారి పలుకుబడి, పరపతిని ఉపయోగించి పొలాలకు నీరు వెళ్లకుండా కాలువలను ఆక్రమించి ప్లాట్లు వేశారు. పంట ఉత్పత్తులను తరలించేందుకు దారి ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు. ప్రస్తుతం ఈ కాలువగుండా మురికినీరు ప్రవహిస్తోంది. బ్రిటీష్ హయాం నుంచి సదరు కేసీ ఉప కాలువ ద్వారా వెళ్లే నీరు పంటలకు అందుతూ చివరకు కుందూనదిని తాకేది. స్వార్థపరుల కారణంగా అమాయక రైతుల పొలాలు తడవక కొందరు బీడుగా వదిలేయాల్సిన పరిస్థితి. ఇక ఈ నీటిని రోడ్డుమీదకు మళ్లించడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు ఆక్రమణ, నీటి ప్రవాహం సమస్యను కొందరు వ్యక్తులు ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లారు. దీనికి సదరు అధికారులు సమాధానం ఇస్తూ రెవెన్యూ అధికారులు తీసుకోవాల్సిన చర్య అంటూ దాట వేస్తున్నారు. మా నుంచి ఆర్‌అండ్‌బీ అధికారులకు లెటర్ పంపామని, వారే స్పందించడం లేదని రెవెన్యూ శాఖ పేర్కొంటోంది. ఇక దిగువకు కాలువ వెంబడి సాగునీరు ట్రాన్స్‌ఫార్మర్, దిమ్మె చుట్టూ చేరుతుండడంతో అది ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు లేవు

పోలీసు స్టేషన్ ఎదురుగా వేసిన ప్లాట్లకు పంచాయతీ అప్రూవల్, ఇతర అనుమతులు ఇవ్వలేదు. నీరు రోడ్డుమీదకు మళ్లించిన విషయం ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలిపాం. రోడ్డు విస్తీర్ణం, హద్దులు నిర్ణయిస్తే తదుపరి చర్యలు తీసుకుంటాం.

-సత్యనారాయణ,
గ్రామపంచాయతీ కార్యదర్శి



పొలాలకు వెళ్లకుండా అడ్డుకట్ట వేయడంతో
ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చేరిన కేసీ నీరు

వైవీయూలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు పూర్తి

● జిల్లా అటవీ అధికారి వినీత్‌కుమార్



మొక్కలు నాటే స్థలాన్ని పరిశలిస్తున్న డీఎఫ్‌వో

కడప ఎన్జీఆర్ సర్కిల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ దినత్సోవాన్ని పురస్కరించుకుని వైవీయూలో మొక్కలు నాటే ప్రదేశాన్ని మంగళవారం జిల్లా అటవీ అధికారి వినీత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5న యూనివర్శిటీలో 5వేల మొక్కలను నాటేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురించి అంద రికీ అవగాహన తీసుకువస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం ఆయన వైవీయూలో మొక్కలు నాటే ప్రదేశాలు పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు, దిశనిర్దేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సామాజిక అటవీ విభాగం డీఎఫ్‌వో శివకుమార్ పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ



రైతులకు పంపిణీ చేస్తున్న డీఏఓ నాగేశ్వర్‌రావు

వీరపునాయునిపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.పాలగిరి రైతు సేవా కేంద్రంలో మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) నాగేశ్వరరావు రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ సాగుకు ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి రైతు తప్పకుండా విత్తనశుద్ధి చేయాలని సూచించారు. కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ వేరుశనగ విత్తన 20-25 రోజుల లోపు గొర్రుతో అంతరకృషి చేసి మొక్కల మొదళ్లకు మట్టిని ఎగదోస్తే కలుపు నిర్మూ లనతో పాటు ఊడలు భూమిలోకి దిగి బాగా ఊరుతాయని తెలిపారు. మండలా ధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ వాతావరణం సాగుకు అనుకూలంగా ఉన్నందున సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలని కోరారు. ఏఓ శ్యామ్‌బాబు, వ్యవసాయ సహాయకులు సమరసింహారెడ్డి పాల్గొన్నారు.

233 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో పట్టుబడిన లారీ

ఖాజీపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని చేసి, రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ శివన్న తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున కడప-కర్నూలు జాతీయ రహదారిలో దుంపలగట్టు క్రాస్ వద్ద అనుమానంతో ఏపీ 39 యూఏ 3609 నంబరుగల లారీని ఆపి తనిఖీ చేశామన్నారు. లారీలో 233 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి డ్రైవర్ ఓబులేసును అదుపులోకి తీసుకుని విచారించామన్నారు.. ప్రొద్దుటూరుకు చెందిన తాటి శరత్‌కుమార్‌కు చెందిన బియ్యంగా తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని కడప సీఎస్‌డీటీ పీఎంతః మనోజ్‌కు, లారీని స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ మోహన్‌కు అప్పగించడంతో పాటు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి : డీఈఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యనందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరం జయనగర్ కాలనీ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి రీసోర్స్ పర్సన్‌ల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ శిక్షణలోని విషయాలను అంకిత భావంతో నేర్చుకొని తిరిగి ఉపాధ్యాయులకు చేరవేయడంలో ఫలప్రదం కావాలని సూచించారు. పాఠశాలలోని విద్యార్థులందరికి విలువలతో కూడిన విద్యనందించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కడప డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణలో టటీచర్స్ హ్యాండ్ బుక్, అకాడమిక్ క్యాలెండర్, కరికులం ఇంటిగ్రేషన్, అసెస్‌మెంట్ బుక్, టటీచ్ టూల్స్ వంటి అంశాలపై ఉపాధ్యాయులందరు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా డీసీఈబీ సెక్రటరీ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్‌సీఆర్‌టీ అబ్జర్వర్ బ్రహ్మానందరెడ్డి, డైట్ లెక్చరర్లు గిరిబాబు, రెడ్డయ్య, స్టేట్ రీసోర్స్ పర్సన్‌లు సుబ్బానాయుడు, గంగాధర్, తిరుమల కొండు, సురేష్‌కుమార్‌రెడ్డి, కృష్ణానాయక్, బాబా సాహెబ్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి ఎద్దులు మృతి



మృతి చెందిన ఎద్దుల వద్ద విలపిస్తున్న రైతు

వీరపునాయునిపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎలమకూరుపల్లె గ్రామానికి చెందిన సాంబశివారెడ్డి అనే రైతు ఇంటి వద్ద నుంచి ఉదయాన్నే ఎద్దుల బండితో సేద్యం చేసేందుకు బయలుదేరి వెళ్లాడు. వ్యవసాయ పొలంలో సేద్యం చేసి తిరిగి వస్తుండగా సమీపంలో ఉన్న కుంటలో ప్రమాదవశాత్తు పడిపోవడంతో అక్కడికక్కడే జత ఎద్దులు మృతి చెందాయి. కుటుంబ పోషణ కోసం దాదాపు రూ.2లక్షలు ఖర్చు చేసి జత ఎద్దులను కొనుగోలు చేశానని, ఎద్దులు చనిపోవడంతో జీవనాధారం కోల్పోయానని కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత రైతును ఆదుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కూలిన ఇల్లు... తప్పిన ప్రమాదం



కొండాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామిరెడ్డిపల్లెలో మంగళవారం వెంకటరెడ్డి అనే రైతుకు చెందిన ఇల్లు కూలింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు నానడంతో కూలినట్లు బాధితుడు తెలిపారు. అదృష్టవశాత్తు మధ్యాహ్నా సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం పక్కాగృహాన్ని మంజూరు చేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ తీగ తెగి పడి గేదె మృతి



బి.కోడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రెడ్డివారిపల్లెలో మంగళవారం రాత్రి విద్యుత్ వైరు తెగి పడటంతో షాక్‌కు గురై గేదె మృతి చెందింది. దాదాపు రూ.80వేలు చేసే గేదె మృతి చెందిందని బాధిత రైతు నాగిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి వాపోయాడు. విద్యుత్ వైరు తెగి కింద పడిందని గ్రామస్థులు మున్నెల్లిలో ఉన్న సబ్‌స్టేషనుకు సమాచారం అందించినా అక్కడ పనిచేస్తున్న సిబ్బంది పొంతనలేని సమాధానం ఇస్తూ కరెంటు ఆఫ్ చేయలేదని గ్రామస్థులు ఆరోపించారు.

ఏడుగురు జూదరులు అరెస్టు

పులివెందుల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలం అంబకపల్లెలో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్టు చేసి రూ.5వేలకు పైగా నగదు స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ ఎన్‌వీ రమణ తెలిపారు. మంగళవారం రాత్రి పులివెందుల రూరల్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో డీఎస్పీ మురళీనాయక్ సూచనలతో రూరల్ పరిధిలో ఉన్న గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రత్యేక టీములు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ ఈ దాడులు చేశామన్నారు.

పొలంలో బయటపడ్డ వినాయక విగ్రహం



విగ్రహానికి పూజలు చేస్తున్న గ్రామ ప్రజలు

పెండ్లిమర్రి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తన వ్యవసాయ పొలంలో మంగళవారం ట్రాక్టర్‌తో ఓ రైతు సేద్యం చేస్తుండగా వినాయక విగ్రహం బయటపడింది. కొత్తగిరియంపల్లెకు చెందిన నడిపి సుబ్బారెడ్డి వెల్లటూరు పొలంలోని బేతాళ ఆంజనేయస్వామి గుడికి దగ్గరలోని తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో సేద్యం చేస్తుండగా వినాయక విగ్రహం బయట పడింది. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలపగా విగ్రహాన్ని బయటకు తీసి పూజలు నిర్వహించారు.

విద్యుత్‌ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలి

మదనపల్లె టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో విద్యుత్ స్తంభం ఎక్కిన జేఎల్‌ఎం బాలకృష్ణ విద్యుదాఘాతానికి గురై కిందపడి గాయపడ్డారని, దీనిపై సమగ్ర విచారణ చేయించాలని సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయం వద్ద సీపీఐ నాయకుడు సాంబశివ ఆధ్వర్యంలో ఎనర్జీ అసిస్టెంట్లు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ జేఎల్‌ఎంలు 33 కేవీ, 11 కేవీ విద్యుత్ స్తంభాలు ఎక్కడకూడదని నిబంధనలు ఉన్నా, కొంత మంది బాలకృష్ణను బలవంతంగా విద్యుత్ స్తంభం ఎక్కించారన్నారు. బెంగళూరులో చికిత్స పొందుతున్న బాలకృష్ణకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఈ ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎనర్జీ అసిస్టెంట్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, ముక్తియార్, కరుణాకర్, వినోద్, రామ్మోహన, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేలాంగణి మాత తిరుణాళ్లు



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న చెన్నుపల్లె సుబ్బారెడ్డి

బ్రహ్మంగారిమఠం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగురాళ్లపల్లె గ్రామంలో వేళాంగణిమాత తిరుణాళ్ల మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. తిరుణాళ్ల సందర్భంగా రెండోరోజు మంగళవారం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి బండలాగుడు పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తరఫున మొదటి బహుమతి కింద రూ.1,00,116, రెండో బహుమతి కాణాల మల్లికార్జునరెడ్డి రూ.70,116, మూడో బహుమతి రూ.50,116, శెట్టిపల్లె సుబ్బారెడ్డి, నాలుగో బహుమతి ఎత్తపు ఈశ్వర్‌రెడ్డి రూ.30116లు, ఐదో బహుమతి బసిరెడ్డి బాలదుగ్గిరెడ్డి రూ.20116 ఎడ్ల యజమానులకు అందించారు. తిరుణాళ్ల మహోత్సవాలకు జడ్పీ చైర్మన్ ముత్యాల రామ గోవిందు రెడ్డి రూ.లక్షా 116లు కమిటీ సభ్యులకు అందించారు.

రోడ్డు పనులు పరిశీలించిన ఆర్డీవో

బ్రహ్మంగారిమఠం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లె గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే, నేషనల్ హైవే రోడ్డు పనులను మంగళవారం రాజంపేట డివిజన్ ఆర్డీవో పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడ పనిచేస్తున్న నేషనల్ హైవే జేఈలతో సిబ్బందితో సమావేశమై త్వరగా రోడ్డు పనులను త్వరితగతిన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దారు రాజనరసింహ నరేంద్ర, డిప్యూటీ తహసీల్దారు జాన్సన్, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కింద పడి యువకుడికి గాయాలు

మైదుకూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని బంగ్లా వద్ద రోడ్డు మరమ్మతులు జరుగుతుండగా మోటర్‌సైకిల్‌పై వెళుతున్న సుబ్బు అనే యువకుడు అదుపుతప్పి కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. యర్రగుంట్ల మండలంలోని కోగటం గ్రామానికి చెందిన వీడియో గ్రాఫర్ సుబ్బు పని మీద మైదుకూరుకు వచ్చి వెళుతుండగా ఈ సంఘటనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పాపాఘ్ని నది తీరవాసుల కల నెరవేరింది

● గండికొవ్వూరు-వెన్నపల్లె మధ్యలో ప్రారంభమైన హైలెవల్ బ్రిడ్జి పనులు

చక్రాయపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికొవ్వూరు-వెన్నపల్లె సమీపాన పాపాఘ్ని నదిపై హైలెవల్ బ్రిడ్జి మంజూరు కావడంతో పాపాఘ్నినది తీరవాసుల కల నెరవేరింది. ఈ కాంట్రాక్టు పనులను సీఎం రమేష్ సోదరుడు సురేష్‌నాయుడు దక్కించుకున్నారు. పీఎంజీఎస్‌వై గ్రాంట్ కింద దాదాపు రూ.28కోట్లు మంజూరైనట్లు తెలిసింది. ఇక్కడ బ్రిడ్జి నిర్మించడంతో రెండు జిల్లాలను కలపడంతో పాటు పాపాఘ్ని నది తీరప్రాంతాలైన రాచుపల్లె, తక్కళ్లపల్లె, నక్కలదిన్నెపల్లె, మల్లప్పగారిపల్లె, సిద్దారెడ్డిగారిపల్లె, గడ్డంవారిపల్లె, కుమార్లకాల్వ, చెరువుకాంపల్లె, అద్దాలమర్రి తీరప్రాంతవాసుల కల నెరవేరింది. ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావా లంటే దాదాపు 15 కిలో మీటర్లు తిరిగి రావాల్సి ఉంది. ఈ బ్రిడ్జి నిర్మించడంతో కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో మండల కేంద్రానికి చేరవచ్చు. అంతేకాకుండా చక్రాయపేట నుంచి తలుపుల, కదిరి, అనంతపురం జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. పాపాఘ్ని తీరప్రాంతవాసులు పండించిన పంటలను మండల కేంద్రానికి, ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఎంతో సులువు కానుంది.

పాపాఘ్ని నదిలో బ్రిడ్జి నిర్మించడానికి యంత్రాలతో పనులు చేస్తున్న దృశ్యం





అతి వేగం..గాలిలో కలుస్తున్న ప్రాణాలు

- చిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు
- యువత స్పీడుకు కళ్లెం వేయండి


బైకులను ఢీకొని మృతిచెందిన చిన్నారులు (ఫైల్)

రాజంపేట టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు పిల్లలను మారాం చేయడంతో వారి సంతోషం కోసం అతి వేగవంతమైన స్పోర్ట్స్ బైకులను అప్పోసప్పో చేసి అయినా కొని ఇస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు తెలియని కుర్రకారు వారికి ఇష్టం వచ్చినట్లు రోడ్లపై చక్కర్లు కొడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనివల్ల కుటుంబాలు సైతం చిన్నాభిన్నమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 18 సంవత్సరాలు పైబడినవారు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, ఉన్న నిబంధనలు అతిక్రమించి యువత అతివేగంతో స్పోర్ట్స్ బైకులను నడపడంతో అవి యమపాశంలా మారి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చుతున్నాయి. కొంత మంది స్నేహితులతో పార్టీలంటూ తప్పతాగి కన్నూమిన్ను తెలియకుండా వాహనాన్ని ఇష్టానుసారం నడిపి ప్రాణాలు బలిగొంటున్నారు. కుటుంబానికి ఆధారంగా ఉండాల్సిన యువత దారి తప్పి అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు.


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడు(ఫైల్)

బైకు యాక్సిడెంట్లతో యువకులు చనిపోతున్నారు



విద్యార్థులు, యువకులు అతివేగంతో బైకు నడపడం వల్ల ప్రమాదాలకు గురై చనిపోతున్నారని ఇది చాలా బాధాకరమని అన్నారు. యువకులకు ప్రమాదాలపై అవగాహన లేకపోవడంతో నేషనల్ హైవేపై వెళ్లినట్లు పట్టణంలో వీధుల్లో వెళుతున్నారు. దీనివల్ల పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రమాదాలపై అవగాహన వచ్చేంతవరకు తల్లిదండ్రులు బైకులను ఇవ్వకపోవడం మంచిదని నా అభిప్రాయం.

- చిన్నయ్య, మన్నూరు, రాజంపేట

రోడ్డు రోమియోలపై చర్యలు చేపట్టాలి



18 సంవత్సరాలు నిండని యువత స్పోర్ట్స్ బైకులను అతివేగంతో రోడ్లపై తాగి ఎదుటివారికి యమపాశంలా మారుతున్నారు. ఇలాంటి రోడ్డు రోమియోలను కళ్లెం వేసేందుకు అధికారులకు స్పీడ్ కంట్రోల్ గన్‌వాడి భారీ జరిమానాలు విధిస్తే ప్రమాదాలను ఎంతోకొంత తగ్గించవచ్చు.

- మనుబోలు వెంకటేశ్వర్లు, రాజంపేట

భద్రతా నియమాలు పాటించకపోవడంతోనే



యువత భద్రత నియమాలు పాటించకపోవడంతోనే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాల్లో యువతను కోల్పోతున్నామని ఎంవీఐ వినోద్ కుమార్ తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు స్పోర్ట్స్ బైకులను కొని ఇవ్వడం, వారికి అవగాహన కల్పించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడంతో తలకు తీవ్ర గాయాలై చనిపోతున్నారు. కుటుంబాలకు ఆధారమైన యువత చనిపోతున్నారు.

- వినోద్‌కుమార్, ఎంవీఐ

సీఎం సహాయ నిధి పంపిణీ


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా వరలక్ష్మి

పెనగలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూడు గ్రామాల్లో ముగ్గురు వ్యక్తులకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మీ మంగళవారం స్థానిక కూటమి నాయకుల ఆధ్వర్యంలో రూ.1.38 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు దాసరి దామోదర్‌నాయుడు, డి.సుదర్శన్‌చౌదరి, కేఎస్ఆర్, గొబ్బూరు హరిబాబురాయల్, కె.కళాచంద్ర, టీడీపీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.శివయ్య, మాజీ సర్పంచ్ ఎం.లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

కోదండ రామాలయ పునర్నిర్మాణానికి రూ.5 లక్షలు వితరణ


ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీ మేడా రఘునాథ్‌రెడ్డి

నందలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలో వెలసిన కోదండరామాలయ పునర్నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు, ఎంపీ మేడా రఘునాథ్‌రెడ్డి రూ.5 లక్షలు వితరణగా అందజేశారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారెమ్మతల్లి ఆలయ అభివృద్ధికి ఆర్థికంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఆలయ ధర్మకర్త గంపా సుధాకర్, నడివీధి సుధాకర్, మహేష్, ఆకుల చలపతి, దుర్గారెడ్డి, అనుదీప్ జయసింహ, కరిముల్లాఖాన్, కోనిశెట్టి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు కౌమార దశనుండే అలవర్చుకోవాలి

రామాపురం, జూన్3 (ఆంధ్రజ్యోతి): నాయకత్వ లక్షణాలను కౌమార దశ నుంచే అలవర్చుకోవాలని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి పద్మావతి పేర్కొన్నారు. నల్లగుట్టపల్లి, కసిరెడ్డిగారిపల్లె సచివాలయాల్లో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మనిషి జీవితంలో కౌమార దశ చాలా ముఖ్యమైనదన్నారు. ఆ వయసులో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో జీవితం కూడా అలాగే ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వీరబల్లి, జూన్3(ఆంధ్రజ్యోతి): వీరబల్లి మండల కేంద్రంలో నివాసమున్న డ్రైవర్ ఊటుకూరు సుబ్బయ్య కుమారుడు శివకుమార్ మంగళవారం సాయంత్రం స్కూటర్ ప్రమాదంలో గాయపడ్డారు. స్కూటర్‌పై వీరబల్లికి వెళుతుండగా మార్గమధ్యంలో ఇందుకూరుపల్లె సమీపంలో కట్టెల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ తగలడంతో స్కూటర్ అదుపు తప్పి పడిపోయాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ప్రథమ చికిత్స చేసి ఆపరేషన్ నిమిత్తం కడపకు రెఫర్ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు పరామర్శించి వైద్యానికి అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే కఠిన చర్యలు

లక్కిరెడ్డిపల్లె, జూన్3(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడే గానీ ప్రభుత్వ భూములు, స్థలాలను ఆక్రమించుకుంటే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లె పొలంలోని 705 సర్వే నెంబర్‌లో 2.2 ఎకరాల భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్, వీఆర్వో కృష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగకు గోవధ జరగకుండా చూడాలి

లక్కిరెడ్డిపల్లె, జూన్3(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలని, అలాగే గోవధ జరగకుండా చూడాలని మంగళవారం సీఐ కొండారెడ్డికి విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బజరంగ్‌దళ్ కృష్ణ విశ్వనాథ, ఆంజనేయులు మాట్లాడుతూ హిందువుల ప్రియమైన గోవు సంరక్షణ ఎంతో గొప్పదని, ఈ గోవులను కాపాడే బాధ్యత అందరిపై ఉందని బక్రీద్ పండగుకు గోవులను హింసించకుండా గోవును వధించకుండా చూడాలని వారు కోరారు.

సమష్టి ఉద్యమాల ద్వారానే సమస్యల పరిష్కారం

రాయచోటిటౌన్, జూన్3(ఆంధ్రజ్యోతి): సమష్టి ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర 3వ కౌన్సిల్ సమావేశం ఈ నెల 5వ తేదీన విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో జరగనుందని, ఉద్యోగస్తులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల రాయచోటి తాలూకా అధ్యక్షుడు సాయికుమార్, తాలూకా కార్యదర్శి సుజిత్, రాజా తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'నా బిడ్డకు, నాకు న్యాయం చేయండి'


తన బిడ్డతో బాధితురాలు సౌజన్య

లక్కిరెడ్డిపల్లె, జూన్3 (ఆంధ్రజ్యోతి): 'నా బిడ్డకు, నాకు న్యాయం చేయండి' అంటూ మండలంలోని కేఎస్ఆర్‌పల్లె పంచాయతీలోని చాగలగుట్టపల్లికు చెందిన దేరంగుల సౌజన్య పోలీసులను విన్నవించారు. మంగళవారం ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల క్రితం మట్లి గ్రామానికి చెందిన మడితాటి మహేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి ఆ పరిచయం ప్రేమగా మారి 2023లో పెళ్లి చేసుకున్నామన్నారు. 2024 ఆగస్టులో ఒక బాబు కూడా జన్మించాడన్నారు. హాస్పిటల్‌లో కూడా తమ బిడ్డ తండ్రి మహేశ్వర్‌రెడ్డి అని ఆధారాలు కూడా ఉన్నాయన్నారు. కానీ అతను బిడ్డ మాత్రమే కావాలని, తనను వద్దంటున్నాడని, డబ్బు డిమాండ్ చేస్తున్నాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరం వేర్వేరు కులాలకు చెందిన వారం కావడంతో కుల వివక్ష కూడా చూపుతున్నాడన్నారు. దీంతో తనకు భర్త కావాలంటూ ఎస్పీ విద్యాసాగర్ నాయుడును కోరగా లక్కిరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌కు పంపించారని ఆమె తెలిపారు. లక్కిరెడ్డిపల్లె పోలీసు అధికారులకు తనకు న్యాయం చేయాలని, న్యాయం జరగకపోతే తన బిడ్డతో ఆత్మహత్య చేసుకుంటానని పేర్కొంది. ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ బాధితురాలికి న్యాయంచేస్తామన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రాణించిన గిరిపుత్రుడు


జయేశ్‌నాయక్

సుండుపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలం వాయలొడ్డు బిడికీకి చెందిన బుక్కే అమృనాయక్, శివకుమారిల దంపతుల పుత్రుడు జయేశ్‌నాయక్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్టీ కేటగిరీలో 72వ ర్యాంకు, జనరల్ కేటగిరీలో పదివేల ర్యాంకు సాధించినట్లు తల్లిదండ్రులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మారుమూల సుండుపల్లె మండలంలో పుట్టి మండలంలోనే ఎవరూ సాధించని ర్యాంకు జయేశ్‌నాయక్ సాధించడం అభినందనీయమన్నారు.

సోమశిల నీటితో చెరువులను నింపాలి

నందలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సోమశిల డ్యాం వెనుకజలాలను లిఫ్టు ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీరందరించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు టీడీపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విజయశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సమస్యపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, టంగుటూరు ఎంపీటీసీ భువనబోయిన పెంచలయ్య, లేబాక గ్రామ సర్పంచ్ లంకయ్యగారి నరసయ్య పాల్గొన్నారు.

'గాలేరు - నగరి' ఒకేదశలో పూర్తి చేయాలి'

చిట్వేలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కడప జిల్లాలో గాలేరు - నగిరి ప్రాజెక్టును ఒకేదశలో పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు మలిశెట్టి రాహుల్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన చిట్వేలిలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గాలేరు - నగిరి ప్రాజెక్టు ఎన్టీఆర్ మానసపుత్రిక అయినందున టీడీపీ దీనిపై శ్రద్ధ తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని రైతు నాయకులు రాహుల్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు విశ్వనాధ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

పెనగలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను అధికారులు సానుకూలంగా పరిష్కరించాలని టీడీపీ రైల్వేకోడూరు మాజీ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. ఎవరి ఒత్తిడికో తలొగ్గి ప్రజా సమస్యలను పరిష్కారం చేయకుండా ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం భావ్యం కాదన్నారు. ఆయన వెంట జనసేన నాయకులు యనమల విజయభాస్కర్, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, ఓబులవారిపల్లె మాజీ జడ్పీటీసీ నాయుడోరి రమణ, పెరగు క్రిష్ణయ్యనాయుడు ఉన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

ఓబులవారిపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు రుచికరమైన భోజనం అందించాలని ఎంఈవో రెడ్డయ్య తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం గురించి ఒకరోజు శిక్షణ నిర్వహించారు. అలాగే వంటల పోటీలు నిర్వహించి అందులో రుచికరంగా వండినవారిని విజేతలుగా ప్రకటించి బహుమతులు అందజేశారు.

అన్నమాచార్యలో అచీవర్స్‌డే వేడుకలు


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు

రాజంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో వార్షిక అచీవర్స్‌డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనంతపురం జేఎన్టీయూ విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ ఆర్.కిరణ్‌మయి, అన్నమాచార్య యూనివర్సిటీ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగాలు పొందినవారు కంపెనీలు స్థాపించే స్థాయికి ఎదగాలన్నారు. ఈ యేడాది అన్నమాచార్య విశ్వవిద్యాలయం నుంచి 1206 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించి మొదటిస్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. సమాజ సేవకు కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ మాట్లాడుతూ ఏఐటీయూసీ కళాశాల ఈ యేడాది మొదటిసారిగా అచీవర్స్‌డే జరుపుకుంటుందన్నారు. రాయలసీమ ప్రాంతంలో ఇదే మొట్టమొదటి కళాశాలగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ సాయిబాబారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను అచీవర్స్‌గా తీర్చిదిద్దిన అధ్యాపకులకు, కంపెనీలను క్యాంపస్‌కు తీసుకువచ్చిన ప్లేస్‌మెంట్ టీమ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ కరణ్మయిని విశ్వవిద్యాలయ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి శాలువతో సత్కరించి మెమెంటోను బహూకరించారు. ప్లేస్‌మెంట్ హెచ్‌వోడీ సునీల్ అల్లువాడ, ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, విశ్వవిద్యాయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు, ఫార్మసి ప్రిన్సిపాల్, పీజీ కళాశాల ప్రిన్సిపల్, ఏఐటీఎస్ ప్రిన్సిపాల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల గుండెచప్పుడు సుగవాసి పాలకొండ్రాయుడు


పాలకొండ్రాయుడి సంస్మరణలో మాట్లాడుతున్న సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, జూన్3(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల గుండెచప్పుడు, ప్రజా నాయకుడు మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురంలో స్వర్గీయ సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ సభను స్థానికులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రసాద్‌బాబు కొత్తపేట రామాపురం, మంగళకాలనీ, తొగటవీధి వాసులతో కలిసి స్వర్గీయ మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పెద్దాయన పాలకొండ్రాయుడు రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచారన్నారు. పాలకొండ్రాయుడుతో తమకున్న అనుబంధాన్ని కొత్తపేట రామాపురం వార్డు ప్రజలు పాత రోజులను గుర్తు చేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. తన తండ్రి వేసిన అడుగుజాడల్లోనే ముందుకు వెళ్లి బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులో ఉంటూ మీకు ఏ అవసరం వచ్చినా నేనుంటాననంటూ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు పెరికల రెడ్డెన్న, తుమ్మగింజల వెంకట్రమణ, మాజీ కౌన్సిలర్ రాంమోహన్, జయసింహారెడ్డి, సుబ్బారెడ్డి, గుండ్లపల్లి వెంకటేశు, రిటైర్డ్ కానిస్టేబుల్ నాగభూషణం, ఎల్ఐసీ శ్రీనివాసులు, గున్నికుంట్ల బలరాం, పురుం రెడ్డెయ్య, ఎర్ర శివ, నల్ల శివ, అంగడి సాయి, సుంకారపు శ్రీనివాసులు, హసనాపురం నాగభూషణం, పోతల ఈశ్వరయ్య, షబ్బీర్, వీరబల్లి ఆంజనేయులు, కోళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

రైల్వేకోడూరు రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పద్ధతులతో అధిక దిగుబడి పొందవచ్చని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం తిరుపతి సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి తెలిపారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం కోడూరు మండలంలోని ఓబనపల్లి, వీపీఆర్ కండ్రిక గ్రామలలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

'భూవిచారణ అధికారిని నేను కాదు'

గాలివీడు, జూన్3(ఆంధ్రజ్యోతి): భూవిచారణ అధికారి తాను కాదని డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. చీమలచెరువుపల్లి పంచాయతీ ఎర్రదొడ్డివాండ్లపల్లెకు చెందిన సుబ్బారెడ్డికి, అదే గ్రామానికి చెందిన వెంకట్రమణకు గత కొంత కాలంగా భూమి విషయమై వివాదం ఉందని, వారు ఇరువురు ఫిర్యాదు చేసుకున్నారని, వారి ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు వివాదాస్పద భూములను పరిశీలించి హద్దులను గుర్తించారన్నారు. తాను ఒక పక్షాన ఉన్నానని, నా మీద తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. తనకు, సుబ్బారెడ్డికి ఎలాంటి సంబంధాలు లేవన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఓబులవారిపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగంపేట గ్రామంలో పర్యటించి పలువురు బాధితులను మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొరముట్ల శ్రీనివాసులు పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన రసూల్ కుమారుడిని పరామర్శించారు. అనంతరం వైసీపీ కార్యకర్త లావులూరి ఓబయ్య ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీఆర్‌యూసీసీ సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, పలువురు వైసీపీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనాన్ని అందించాలి

నందలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎంఈవో-1 నాగయ్య అన్నారు. మండలంలో మధ్యాహ్న భోజనం వంట చేసేవారికి మంగళవారం నాగిరెడ్డిపల్లె హైస్కూల్లో ట్రైనింగ్ కుకింగ్ పోటీలను ఎంఈవో-2 సీఆర్ అనంతకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో నాగయ్య పాల్గొని మాట్లాడారు. వంట ఏజెన్సీ నిర్వాహకులు ముజఫర్‌అహ్మద్, అమరావతి, వెంకటనరసమ్మ, రేవతి, సాంబశివ, మాలతి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం కాదు.. గొడ్డలి పోటు దినం అని పెట్టండి'

వీరబల్లి, జూన్3(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు దినం కాకుండా గొడ్డలిపోటు దినం అని పెట్టి ఉంటే బాగుండేదని టీడీపీ వీరబల్లి మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు అన్నారు. వీరబల్లి టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నమ్మిన వారినే వెన్నుపోటు పొడిచిన ఘనత వైసీపీ నేతలకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు విషం చిమ్మడం తగదన్నారు. వైసీపీ నేతలు ఇలాంటి విషపూరితమైన కార్యక్రమాలు చేపట్టి గగ్గోలు పెట్టుకున్నా రాష్ట్ర ప్రజలు వైసీపీ నేతలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు రాంమోహన్‌రెడ్డి, బీజేపీ నాయకులు నరేంద్ర, టీడీపీ నాయకులు మల్లికార్జునయాదవ్, భాస్కర్‌రాజు, చలపతి, ప్రసాద్‌రాజు, నాగప్పనాయుడు పాల్గొన్నారు.

'జగన్‌రెడ్డి వెన్నుపోటు గురించి మాట్లాడటం హాస్యాస్పదం'

రాయచోటిటౌన్, జూన్3(ఆంధ్రజ్యోతి): సొంత రక్తానికే వెన్నుపోటు పొడిచిన జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుపోటు గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణారెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో వెన్నుపోట్ల చరిత్రను, పరంపరను చూసుకుంటే మొదటి పాఠశాల మీ ఇంట్లోనే ఉందన్నారు. మంగంపేట మైన్స్ హత్యల నుంచి, పీవీ నరసింహారావు మీద చెప్పులు విసరలేదా వెన్నుపోట్లు కావా అని వారు ప్రశ్నించారు.

ఒంటిమిట్టలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా


ట్రాక్టర్ల ద్వారా వెళుతున్న మట్టి

ఒంటిమిట్ట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మట్టి మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వ అనుమతులు లేకుండా దర్జాగా పట్టపగలు అక్రమంగా మట్టిని తలరిస్తున్నారు. లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. ఇదెక్కడో కాదు జిల్లాలోనే అతి పెద్దచెరువులో ఒక్కటైన ఒంటిమిట్ట చెరువులో గత రెండు రోజులుగా జరుగుతున్న తంతు ఇది. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పొలాలకు సంబంధించి చెరువు మట్టిని ఉచితంగా తీసుకెళ్లేందుకు అనుమతులు ఇచ్చింది. ఇదే అదునుగా భావించిన మట్టి మాఫియా కనీసం ఇరిగేషన్ శాఖ వారి నుంచి అనుమతులు కూడా లేకుండా మట్టిని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మండలంలో ప్రధానంగా ఒంటిమిట్ట గంగలచెరువు ఉన్నాయి. ఈ ప్రాంత రైతులు ఇరిగేసన్‌శాఖ అధికారుల ద్వారా అనుమతి పొంది రైతు సొంతంగా మట్టిని తీసుకెళ్లాలి కాని మట్టి మాఫియా కన్ను ఒంటిమిట్ట చెరువు మట్టిపై పడింది. ఎలాగైనా లక్షలాది రూపాయలు సంపాదించాలనే ఆశతో అక్రమ మార్గాన్ని ఎంచుకున్నారు. రైతులు అనుమతి కోసం ఇరిగేషన్ శాఖ అధికారులను సంప్రదించాలి. ఇరిగేషన్ శాఖ అధికారులు రైతుకు సంబంధించిన పొలం, సర్వేనంబరుతో సహా అనుమతిపత్రంలో పొందుపరిచి అనుమతి పత్రాన్ని రైతుకు ఇస్తారు.రైతు అనుమతి పత్రంలో ఉన్న సర్వేనంబర్లు మాత్రమే మట్టిని తీసుకెళ్లాలి. అలాంటిది గత పది రోజుల నుంచి ఒక్క రైతు పేరుతో అనుమతి తీసుకొని వేరే రైతులకు మట్టిని విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ 600 నుంచి 800 వరకు మట్టిని విక్రయిస్తున్నారు. ఆదివారంతో అనుమతులు ముగిశాయి. సోమవారం, మంగళవారం కూడా మట్టి మాపియా వెనక్కి తగ్గలేదు. అనుమతులు లేకుండా కూడా రెండు రోజుల పాటు విచ్చలవిడిగా మట్టిని దోచేశారు. రెండు రోజులు మట్టి తవ్వకాలకు అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తుంటే అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదని విమర్శలు వస్తున్నాయి. మట్టి తరలివెళ్లకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతులకే అనుమతులు



ఒంటిమిట్ట చెరువు మట్టి తీసుకెళ్లేందుకు రైతులకే అనుమతులు ఇస్తాం. ఏ రైతు, ఏ సర్వేనంబరుకు అనుమతి వస్తుందో ఆ సర్వేనంబరు పొలంలోనే మట్టిని తోలుకోవాలి. వేరే సర్వేనంబరులో పొలానికి మట్టి తీసుకెళితే కఠినచర్యలు తీసుకుంటాం. మట్టిమాఫియాకు అడ్డుకట్ట వేస్తాం.

- పాటూరు గంగిరెడ్డి, చైర్మన్, ఒంటిమిట్ట చెరువు సంఘం

కఠినచర్యలు తీసుకుంటాం

ఒంటిమిట్ట చెరువులో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటాం. సోమవారం, మంగళవారం ఎవరికి అనుమతులు ఇవ్వలేదు. మట్టిని తరలిస్తున్నారని తమకు సమాచారం రావడంతో వెంటనే అధికారులను పంపి నిలిపివేశాం.

- సాయికిషోర్, ఏఈ, ఇరిగేషన్‌శాఖ, ఒంటిమిట్ట

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుమారి

రామాపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు 40వ జాతీయ రహదారిపై మంగళవారం కంభంపాటి కుమారి (32) మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గాలివీడు మండలం కమలాపురానికి చెందిన కంభంపాటి కుమారి మంగళవారం తమ తల్లిగారి ఊరైన రామాపురం మండలం నీలకంఠ్రావుపేట పంచాయతీ గాండ్లపల్లికి ఏపీ04 టీఎక్స్ 8555 నెంబరు గల రాయచోటి డిపోకు చెందిన హెయిర్ బస్సులో బయలుదేరారు. దర్గా రోడ్డు బస్‌స్టాప్ వద్ద బస్సు దిగుతుండగా బస్సు ఒక్కసారి కదలడంతో ఆమెపై రెండు టైర్లు ఎక్కాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. కాగా ఈమెకు గాలివీడు మండలం కమలామర్రి గ్రామంలో 2010లో రెడ్డెప్పతో వివాహమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడు ..


నారాయణ మృతదేహం

కలకడ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె లక్ష్మీనగర్‌కు చెందిన నారాయణ (60) ఎర్రయ్యగారిపల్లెలోని బంధువుల ఇంటికి వచ్చి, తిరిగి బస్టాండుకు నడిచి వెళ్లుతుండగా ఎర్రగుంట్ల నుంచి చిత్తూరు వెళుతున్న లారీ.. ముందు వెళ్లుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసే సమయంలో ఆయనను ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న వెంకటమ్మ

సిద్దవటం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థులు మెరుగైన వైద్యసేవల కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... భాకరాపేట గ్రామానికి చెందిన భార్యాభర్తలు నల్లగొండ చెన్నయ్య, వెంకటమ్మ సోమవారం రాత్రి శివాలయం వద్ద హైవే రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. చెన్నయ్య తలకు బలమైన గాయం కాగా, వెంకటమ్మ ఎడమకాలు పూర్తిగా విరిగిపోయింది. వైద్యసేవల కోసం సోమవారం రాత్రి అంబులెన్స్‌లో కడప రిమ్స్‌కు తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ మేరకు సిద్దవటం ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ ఢీకొన్న వాహనం ఆచూకీ సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, హైవేరోడ్డు దాటేప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండి వాహనాల రాకపోకలు గమనించి రోడ్డు దాటాలని తెలిపారు.

పంట పొలాలపై రైతులకు అవగాహన


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

చిన్నమండెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్, ఉద్యానవాధికారి రవీంద్రబాబు మంగళవారం నిర్వహించారు. వికసిత్ కృషి, సంకల్ప అభియాన్ కింద కేవీకే ఊటుకూరు వారి ఆధ్వర్యంలో చిన్నమండెం, బోరెడ్డిగారిపల్లె గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవణాధికారి వనితాభాయి, ఏవో గీత, శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, జిల్లా వ్యవసాయాధికారి సుచిత్ర, 150 మంది రైతులు పాల్గొన్నారు.

అక్కడ స్మగ్లర్‌దే పెత్తనం..?


అనధికార వీఆర్ఏకు ఆన్‌లైన్ చేసి కట్టబెట్టిన ప్రభుత్వ భూమిలో సాగు చేసిన మామిడితోట

- తల్లికి బదులు 16 కేసుల్లో నిందితుడిగా ఉన్న కొడుకు వీఆర్ఏగా విధులు
- ప్రతిరోజు తహశీల్దారు, ఆర్ఐ ఎదుట కూర్చుని ముచ్చట్లు
- ఎవరికి ఏ పనికావాలన్నా తను ఓకే అంటే చాలు..

పుల్లంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పుల్లంపేట తహశీల్దారు కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. గతంలో ఇక్కడ పనిచేసిన తహశీల్దారులంతా కోట్లకు పడగలెత్తారని కిందిస్థాయి సిబ్బందితో పాటు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూములు అక్రమార్కులకు ఆన్‌లైన్ చేసి కోట్ల రూపాయలు దండుకున్నారు. డీకేటీ భూముల అమ్మకంలో లబ్ధిదారుల పేర్లు మార్చేందుకు లక్షల్లో వసూలు చేశారని బాహాటంగా చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ఈ తహశీల్దారు కార్యాలయం గంజాయి, ఎర్రచందనం స్మగ్లర్లకు అడ్డాగా మారింది. వీరి ద్వారానే కోట్లాది రూపాయల లావాదేవీలు, డీకేటీ భూములకు సంబంధించి యజమానుల పేర్లు మార్పు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మారినా తహశీల్దారు కార్యాలయంలో మాత్రం ఇప్పటికీ స్మగ్లర్లే రాజ్యమేలుతున్నారు.

16 ఎర్రచందనం కేసుల్లో ఉన్నా..

పుల్లంపేట గ్రామ రెవెన్యూ విలేజ్‌లో వీఆర్ఏగా పనిచేస్తున్న మహిళ తనకు ఆరోగ్యం సరిగా లేదని, కుమారునికి విధులు అప్పజెప్పారు. అయితే అతను 16 ఎర్రచందనం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసుల్లో జైలుకు వెళ్లిన అతను ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు. వీఆర్ఏ అంటే తహశీల్దారు కార్యాలయంలో అన్నిటి కంటే చిన్న ఉద్యోగం ఇదే. అయితే ఇతను మాత్రం పుల్లంపేట తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు కంటే పెద్ద అని చెప్పుకోవచ్చు. రోజూ ఆఫీసుకు రావడం.. తహశీల్దారు ఎదుట లేదా ఆర్ఐ ఎదుట కుర్చీలో దర్జాగా కూర్చుని గంటల తరబడి మాట్లాడుతూ ఉంటాడు. తహశీల్దారు కార్యాలయంలో ఇతను అనుకుంటే జరగని పని ఉండదు. గతంలో పనిచేసిన తహశీల్దారుకు, ఇప్పుడు పనిచేస్తున్న రెవెన్యూ అధికారులందరికీ ఈ అనధికార వీఆర్ఏ సకల సౌకర్యాలు కల్పిస్తూ పనులు చేయించుకుంటున్నాడని అంటున్నారు. రెవెన్యూ అధికారులకు, అక్రమార్కులకు ఇతను మధ్యవర్తిగా ఉంటున్నాడని.. అందుకు ప్రతిఫలంగా అధికారులు ప్రభుత్వ భూములను అతనికి కట్టబెట్టేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతను గత ఆరేళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నాడు.

ఇవీ ఉదాహరణలు..

అనధికార వీఆర్ఏగా వ్యవహరిస్తున్న ఈ ఎర్రచందనం స్మగ్లర్ నిబంధనలకు విరుద్ధంగా తిరుపతి-కడప హైవే పక్కన కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల పక్కనే సుమారు ఐదెకరాల భూమిని స్వాధీనం చేసుకుని చుట్టూ కంచె వేసి ఎస్టేట్‌లాగా మార్చుకున్నాడు. అధికారులు సైతం వీఆర్ఏ బంధువుల పేర్లతో నాలుగు ఎకరాలు ఆన్‌లైన్ చేసేశారు. ఆన్‌లైన్ చేయడంతో ఆ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుని బోరు వేసి డ్రిప్ ద్వారా మామిడితోట సాగు చేస్తున్నాడు. రంగంపల్లె రెవెన్యూ విలేజ్‌లో సర్వే నెంబరు-522లో బంధువుల పేర్లతో సుమారు 40 ఎకరాలకు పైగా ఆన్‌లైన్ చేశారని సమాచారం. రెవెన్యూ అధికారులకు ఎంతగా దోచిపెట్టి సౌకర్యాలు కల్పించకపోతే అన్ని ఎకరాల ప్రభుత్వ భూములు అతడికి ఆన్‌లైన్ చేసి కట్టబెడతారని పలువురు విమర్శిస్తున్నారు.

విజిలెన్స్ విచారణ చేపట్టాలి


పుల్లంపేట చౌకదుకాణం-2 ప్రారంభోత్సవంలో టీడీపీ నాయకులతో పాటు తహసీల్దార్, ఎర్రచందనం స్మగ్లర్ పోలి రవి


ప్రభుత్వ భూమి ఆన్‌లైన్ కావడంతో బోరు వేసి ట్రాన్స్‌ఫార్మర్, పైపులైను ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రభుత్వం మారినా రెవెన్యూ అధికారుల తీరు మారడం లేదని, అవినీతికి దాసోహం అయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు విచారణ చేపడితే ప్రభుత్వ భూములు ఎంతమేర ఆక్రమణకు గురయ్యాయి, అధికారులు ఎన్ని ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్ చేశారు, డీకేటీ భూముల అమ్మకం విషయంలో లబ్ధిదారుల పేర్లు మార్చడం ద్వారా ఎన్ని కోట్ల రూపాయలు చేతులు మారాయో వెలుగుచూసే అవకాశం ఉంది. ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు వస్తున్నా పుల్లంపేటలో పనిచేసే రెవెన్యూ అధికారులు దీనిని ఏమాత్రం లెక్కచేయడం లేదని తెలుస్తోంది.

ఎర్రచందనం స్మగ్లర్ అనధికారికంగా వీఆర్ఏగా పనిచేయడంపై తహశీల్దారు అరవింద కిశోర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. తనకు ఆరోగ్యం సరిగా లేదని తన కుమారుడిని విధులకు పంపుతున్నామని వీఆర్ఏ చెప్పడంతో ఒప్పుకుని పని చేయించుకుంటున్నామన్నారు. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో అతని చేతే పని చేయించుకుంటున్నామని, ఎర్రచందనం స్మగ్లర్ అయితే ఏమి? మా ఆఫీసులో స్మగ్లింగ్ చేసేది ఏమీ లేదని అనడం గమనార్హం.

ఉపాధి ఏపీవోపై ఎమ్మెల్యే ఆగ్రహం

- వెంటనే సెలవుపై వెళ్లాలని ఆదేశం


కేవీ పల్లె మండల పురోగతిపై సమీక్షిస్తున్న కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కూలీలకు అవసరమైన స్థాయిలో పనులు కల్పించలేనప్పుడు ఉద్యోగాలు చేయడం ఎందుకని, కేవీ పల్లె మండలం ఉపాధి హామీ పనుల్లో జిల్లా స్థాయిలో చివరి స్థానానికి చేరడం సిగ్గుచేటని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతమైన పీలేరులో 45 వేల పనిదినాలు కల్పించగా జిల్లాలో అతి పెద్దదైన వెనుకబడిన మండలం కేవీ పల్లెలో కేవలం 16 వేల పనిదినాలు కల్పించడంతో ఉపాధి హామీ సిబ్బంది తీవ్ర అలసత్వాన్ని చూపిస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం నగరిపల్లెలో కలికిరి, కలకడ, గుర్రంకొండ, పీలేరు, వాల్మీకిపురం, కేవీ పల్లె మండలాలకు సంబంధించిన ఉపాధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించిన సందర్భంగా ఆయన అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మండలం వారీగా ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీవో, ఏపీవోలతో విడివిడిగా సమస్యల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏపీవో నాగరాజు పనితీరుపై వస్తున్న విమర్శలను ఎమ్మెల్యే ప్రధానంగా ప్రస్తావించారు. జిల్లాలో అత్యధికంగా కూలీలున్న మండలం కేవీ పల్లెలోనే పురోగతి లేకుంటే ఇక అధికారులు పేదలకు ఎలా న్యాయం చేస్తారని నిలదీశారు. వెంటనే సెలవు పెట్టి వెళ్లిపోవాలని ఏపీవోను ఆదేశించారు. ఉన్నతాధికారులు కూడా ఇలాంటి వారిపట్ల ఉదాసీనంగా వ్యవహరించడం బాధ్యతగా లేదని విమర్శించారు. మిగిలిన మండలాల్లో అధికారులు అందజేసిన నివేదికలు కాస్త సంతృప్తికరంగా వుండటంతో కూలీ సంఖ్య ఇంకా పెంచాలని సూచించారు. సీసీ రోడ్లు, గోకులాలకు బిల్లులు పెండింగ్‌లో పెట్టకుండా పనులు పూర్తి చేయించాలని సూచించారు. కూలీలకు ఇబ్బంది లేకుండా పనులను పెంచుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కలికిరి క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసులు, ఆయా మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు ఎస్.మనోహర్ రాజు, ఎల్.సునీల్‌కుమార్ (వాల్మీకిపురం), జి.శివశంకర్, ఎం.అశోక్‌రెడ్డి (పీలేరు), సుధాకర్, నాగరాజు (కేవీ పల్లె), భానుమూర్తి, మంజుల (కలికిరి), కె.వెంకటేశులు, కె.జయరామిరెడ్డి (గుర్రంకొండ), అబ్దుల్ కరీం, డి.సుజాత (కలకడ)లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు తీపి కబురు

ఇదిలా వుండగా తాజాగా అందిన సమాచారం మేరకు గత రెండు నెలలుగా కూలీలకు చెల్లించాల్సిన వేతన బకాయిల కోసం మంగళవారం రాష్ట్రానికి రూ.1029.55 కోట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు పెండింగ్‌లో వున్న మెటీరియల్ బిల్లులతో పాటు కూలీలకు చెల్లించాల్సిన బకాయిలకు కూడా మోక్షం కలగనుంది. పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయడానికి చెల్లింపుల కోసం సిద్ధం చేయాలని డ్వామా కార్యాలయానికి వర్తమానం అందింది. రెండు నెలలుగా కూలీల వేతనాలు పేరుకుపోతున్న కారణంగా పనులు ప్రారంభించడానికి ఆటంకంగా వుందని చెబుతున్న అధికారులు బకాయిల విడుదలకు సంబంధించిన సమాచారం ఉపశమనం కలిగించిందని చెబుతున్నారు.

కోర్టులో గంగమ్మ జాతర ప్రారంభం

- అమ్మవారి భారీ విగ్రహ ప్రతిష్ఠ

మదనపల్లె అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోర్టులో గంగమ్మజాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఉదయాన్నే అమ్మవారికి విశేషంగా పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. పట్టణంలోని శాస్త్రివీధికి చెందిన రాటకొండ బాబురెడ్డి ఇంటి నుంచి కల్లు, కమ్మర భాస్కర ఇంటి నుంచి గంగమ్మ మట్టి ప్రతిమ, జోలపాళెం భవానీ ప్రసాద్ ఇంటి నుంచి చీర, పసుపు, కుంకుమ, సారె తెచ్చారు. సాయంత్రం ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ఆరు అడుగుల ఎత్తైన గంగమ్మ ప్రతిమను ప్రతిష్ఠించారు. అనంతరం మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్ జోలపాళెం భవానీప్రసాద్, జోలపాళెం దేవేంద్ర తొలిపూజ నిర్వహించారు. జోలపాళెం వంశస్థుల ఆడబిడ్డగా అవతరించిన గంగమ్మకు పుట్టింటివారు తొలిపూజ చేయడం ఆనవాయితీ. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పట్టణంలోని మహిళలు అమ్మవారికి దివ్వెలు, బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. బెంగళూరు రోడ్డు, అమ్మినేనివీధి, కోర్టువీధి, పటేల్‌రోడ్డు, డాక్టర్ కజ్జన్‌వీధి, కదిరిరోడ్డుల్లో విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, ట్రెజరర్లు రంగస్వామినాయుడు, కరుణాకర్‌నాయుడు, మహేష్, విక్కీ, మల్లికార్జున నాయుడు, శ్రీనివాస్ పర్యవేక్షించారు.



విశేషంగా అలంకరించిన కోర్టులో గంగమ్మ ఆలయం, ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి


దాడిలో గాయపడ్డ ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహారావు, తండ్రి పిచ్చయ్య

రాజంపేటటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులకు హాజరు కాకపోయినా వేతనం వచ్చేలా చేయాలని వేధించేవారని, వారి మాట వినకపోవడంతో తాను, తన తండ్రిపై కొందరు దాడి చేసినట్లు శవనవారిపల్లె ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మలగాని నరసింహరావు మంగళవారం మన్నూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... సోమవారం రాత్రి 10 గంటల సమయంలో గ్రామానికి చెందిన లింగం రాజా, లింగం దుర్గయ్య, లింగం హరిబాబు, నారాయణ, అరవింద్, కొంత మందితో కలిసి ఇంటిలో ఉన్న సమయంలో తనపై, అడ్డు వచ్చిన తన తండ్రిపై కూడా దాడిచేసి ఇంటిలోని వస్తువులను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ ఘటనను బాధితుడు శక్తియాప్‌లో చిత్రీకరిస్తుంటే దౌర్జన్యంగా సెల్‌ఫోన్‌ను లాక్కొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. గత కొన్నిరోజులుగా ఉపాధి హామీ పనులకు రాకపోయినా వేతనం వచ్చేలా చేయాలని వేధించేవారని, అందుకు నిరాకరించడంతో తనపైకి దాడికి దిగినట్లు బాధితుడు తెలిపారు. తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడినవారు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

దాడిలో గాయపడిన వృద్ధుడు


చికిత్స పొందుతున్న వృద్ధుడు

మదనపల్లె అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మహిళను హింసిస్తున్నాడని అడ్డుకొన్నందుకు రాడ్‌తో కొట్టి గాయపర్చిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు సోమవారం రాత్రి మదనపల్లె మండలం, మొలకలదిన్నెకు చెందిన రెడ్డెమ్మ భర్త హరిబాబు నాలుగేళ్ల క్రితం ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆమె తన ముగ్గురు పిల్లలతో కలసి ఉంటోంది. ఈ నేపథ్యంలో తన కోరిక తీర్చాలంటూ సమీప బంధువు ఆమెను వేధించేవాడు. ఇందుకు నిరాకరించిన ఆమెపై మంగళవారం విజయభాస్కర్, మరికొంత మంది కలిసి దాడి చేశారు. అడ్డుకున్న రమణయ్య(55)ను రాడ్‌తో కొట్టి గాయపరిచారు. స్థానికులు అతన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నిత్యపూజయ్యా... ఇదేందయ్యా...!

- నిత్యపూజేశ్వర కోనలో వసతులు నిల్
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

సిద్దవటం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దట్టమైన లంకమల అభయారణ్యంలో ఎత్తైన కొండ కోనల్లో కొలువుదీరిన నిత్యపూజేశ్వర స్వామి ఆలయంలో వద్ద వసతులు కరువయ్యాయి. రహదారి సరిగా లేక భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. మండలంలోని వంతాటిపల్లె సమీపంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వర కోనకు ప్రతి సోమవారం కడప నగరంతో పాటు అట్లూరు, గోపవరం, మాధవరం, బద్వేల్, వేంపల్లె, ప్రొద్దుటూరు, మైదుకూరు, పోరుమామిళ్ల తదితర గ్రామాల నుంచి భక్తులు శివపార్వతుల దర్శనం కోసం వస్తుంటారు. మహాశివరాత్రి రోజున ఉమ్మడి కడప జిల్లా, ఇతర జిల్లాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. స్వామివారి సన్నిధానానికి వెళ్లే మార్గంలో రహదారికి అడ్డంగా పెద్ద పెద్ద గుండ్లు, వృక్షాలు ఉండడంతో భక్తులకు తీవ్ర ఇక్కట్లు తలెత్తాయి. భక్తులు తాగే మంచినీటి గుండాల్లో అపరిశుభ్రత ఏర్పడి దుర్వాసన వెదజల్లుతోంది. మహిళలకు మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యపూజకోనకు వచ్చే భక్తులు ఇచ్చే కానుకలు లక్షల్లో వస్తున్నా మౌలిక వసతులు కల్పించడంలో ఎండోమెంట్ శాఖ పూర్తిగా విఫలమైందని పలువురు పేర్కొంటున్నారు. సన్నిధానికి వెళ్లే మెట్ల మార్గం పాక్షికంగా దెబ్బతినడంతో మోకాళ్ల మీద దర్శనానికి వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

మహిళలకు వసతులు కల్పించాలి



నిత్యపూజకోనలో మహిళా భక్తులు వసతులు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. బట్టలు మార్చుకోవడానికి సరైన వసతి లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. వెంటనే ఎండోమెంట్ ఒక గది ఏర్పాటు చేయాలి.

- లక్ష్మీదేవి, భక్తురాలు, కడప


మహిళలు దుస్తులు మార్చుకునే షెడ్డు దుస్థితి


అలంకరణలో నిత్యపూజేశ్వరస్వామి - అపరిశుభ్రంగా ఉన్న కోనలోని మంచినీటి గుండం

రహదారిని బాగు చేయాలి



నిత్యపూజ కోనకు వెళ్లే రహదారిని బాగు చేయాలి. కాలినడకన వెళ్లే భక్తులకు పెద్ద పెద్ద గుండ్లు, వృక్షాలు, ఉండడంతో వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులు రహదారిని అభివృద్ధి చేసి సౌకర్యంగా ఉండేలా చూస్తే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

- శంకరయ్య, సిద్దవటం

కేసీ నీటికి అడ్డుకట్ట

● ప్లాట్ల వ్యాపారం కోసం రోడ్డుమీదకు మళ్లింపు ● బీడువారుతున్న పంట పొలాలు



కేసీ ఉపకాలువ నీటిని రోడ్డు పక్కకు మళ్లించిన దృశ్యం

దువ్వూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కొందరి వ్యక్తుల స్వార్థంతో రోడ్డును ఆనుకుని ఉన్న స్థలం, పొలాన్ని వ్యాపారం కోసం ఉపయోగిస్తూ దిగువ ఉన్న పొలాలకు తాగునీరు వెళ్లకుండా అడ్డుపడుతున్నారు. దీంతో దిగువ ఉన్న పంట పొలాలకు సాగు నీరు అందక బీడు భూములుగా మారుతున్నాయి. ఈ నీళ్లు రోడ్డు వెంబడి ప్రవహిస్తుండడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ వ్యవహారం కొనసాగబట్టి అయిదేళ్లు దాటినా.. అడిగేవారు లేకపోవడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. వివరాల్లోకి వెళ్లితే...

దువ్వూరులో పోలీసుస్టేషన్ ఎదురుగా రహదారి పక్కనే పడమర వైపున కేసీ ఆయకట్టు పొలాలు ఉన్నాయి. బ్రిటీష్ హయాం నుంచి కేసీ కాలువకు తూములను ఏర్పరచి ఉప కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నారు. ఇక్కడ కొందరు వ్యక్తులు వారి పలుకుబడి, పరపతిని ఉపయోగించి పొలాలకు నీరు వెళ్లకుండా కాలువలను ఆక్రమించి ప్లాట్లు వేశారు. పంట ఉత్పత్తులను తరలించేందుకు దారి ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు. ప్రస్తుతం ఈ కాలువగుండా మురికినీరు ప్రవహిస్తోంది. బ్రిటీష్ హయాం నుంచి సదరు కేసీ ఉప కాలువ ద్వారా వెళ్లే నీరు పంటలకు అందుతూ చివరకు కుందూనదిని తాకేది. స్వార్థపరుల కారణంగా అమాయక రైతుల పొలాలు తడవక కొందరు బీడుగా వదిలేయాల్సిన పరిస్థితి. ఇక ఈ నీటిని రోడ్డుమీదకు మళ్లించడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు ఆక్రమణ, నీటి ప్రవాహం సమస్యను కొందరు వ్యక్తులు ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లారు. దీనికి సదరు అధికారులు సమాధానం ఇస్తూ రెవెన్యూ అధికారులు తీసుకోవాల్సిన చర్య అంటూ దాట వేస్తున్నారు. మా నుంచి ఆర్అండ్‌బీ అధికారులకు లెటర్ పంపామని, వారే స్పందించడం లేదని రెవెన్యూ శాఖ పేర్కొంటోంది. ఇక దిగువకు కాలువ వెంబడి సాగునీరు ట్రాన్స్‌పార్మర్, దిమ్మె చుట్టూ చేరుతుండడంతో అది ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు లేవు

పోలీసు స్టేషన్ ఎదురుగా వేసిన ప్లాట్లకు పంచాయతీ అప్రూవల్, ఇతర అనుమతులు ఇవ్వలేదు. నీరు రోడ్డుమీదకు మళ్లించిన విషయం ఆర్అండ్‌బీ అధికారులకు తెలిపాం. రోడ్డు విస్తీర్ణం, హద్దులు నిర్ణయిస్తే తదుపరి చర్యలు తీసుకుంటాం.

-సత్యనారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శి



పొలాలకు వెళ్లకుండా అడ్డుకట్ట వేయడంతో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చేరిన కేసీ నీరు

వైవీయూలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు పూర్తి

● జిల్లా అటవీ అధికారి వినీత్‌కుమార్



మొక్కలు నాటే స్థలాన్ని పరిశలిస్తున్న డీఎఫ్‌వో వినీత్‌కుమార్

కడప ఎన్జీఆర్ సర్కిల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినత్సోవాన్ని పురస్కరించుకుని వైవీయూలో మొక్కలు నాటే ప్రదేశాన్ని మంగళవారం జిల్లా అటవీ అధికారి వినీత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5న యూనివర్శిటీలో 5వేల మొక్కలను నాటేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురించి అంద రికీ అవగాహన తీసుకువస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం ఆయన వైవీయూలో మొక్కలు నాటే ప్రదేశాలు పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు, దిశనిర్దేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సామాజిక అటవీ విభాగం డీఎఫ్‌వో శివకుమార్ పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ



రైతులకు పంపిణీ చేస్తున్న డీఏఓ నాగేశ్వర్‌రావు

వీరపునాయునిపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.పాలగిరి రైతు సేవా కేంద్రంలో మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) నాగేశ్వరరావు రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ సాగుకు ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి రైతు తప్పకుండా విత్తనశుద్ధి చేయాలని సూచించారు. కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ వేరుశనగ విత్తన 20-25 రోజుల లోపు గొర్రుతో అంతరకృషి చేసి మొక్కల మొదళ్లకు మట్టిని ఎగదోస్తే కలుపు నిర్మూ లనతో పాటు ఊడలు భూమిలోకి దిగి బాగా ఊరుతాయని తెలిపారు. మండలా ధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ వాతావరణం సాగుకు అనుకూలంగా ఉన్నందున సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలని కోరారు. ఏఓ శ్యామ్‌బాబు, వ్యవసాయ సహాయకులు నమరసింహారెడ్డి పాల్గొన్నారు.

233 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో పట్టుబడిన లారీ

ఖాజీపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని చేసి, రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ శివన్న తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున కడప-కర్నూలు జాతీయ రహదారిలో దుంపలగట్టు క్రాస్ వద్ద అనుమానంతో ఏపీ 39 యూఏ 3609 నంబరుగల లారీని ఆపి తనిఖీ చేశామన్నారు. లారీలో 233 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి డ్రైవర్ ఓబులేసును అదుపులోకి తీసుకుని విచారించామన్నారు.. ప్రొద్దుటూరుకు చెందిన తాటి శరత్‌కుమార్‌కు చెందిన బియ్యంగా తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని కడప సీఎస్‌డీటీ పీఎంఈ మనోజ్‌కు, లారీని స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ మోహన్‌కు అప్పగించడంతో పాటు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి : డీఈఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యనందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరం జయనగర్ కాలనీ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి రీసోర్స్ పర్సన్‌ల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ శిక్షణలోని విషయాలను అంకిత భావంతో నేర్చుకొని తిరిగి ఉపాధ్యాయులకు చేరవేయడంలో ఫలప్రదం కావాలని సూచించారు. పాఠశాలలోని విద్యార్థులందరికి విలువలతో కూడిన విద్యనందించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కడప డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణలో టటీచర్స్ హ్యాండ్ బుక్, అకాడమిక్ క్యాలెండర్, కరికులం ఇంటిగ్రేషన్, అసెస్‌మెంట్ బుక్, టటీచ్ టూల్స్ వంటి అంశాలపై ఉపాధ్యాయులందరు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా డీసీఈబీ సెక్రటరీ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్‌సీఆర్‌టీ అబ్జర్వర్ బ్రహ్మానందరెడ్డి, డైట్ లెక్చరర్లు గిరిబాబు, రెడ్డయ్య, స్టేట్ రీసోర్స్ పర్సన్‌లు సుబ్బానాయుడు, గంగాధర్, తిరుమల కొండు, సురేష్‌కుమార్‌రెడ్డి, కృష్ణానాయక్, బాబా సాహెబ్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి ఎద్దులు మృతి



మృతి చెందిన ఎద్దుల వద్ద విలపిస్తున్న రైతు

వీరపునాయునిపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎలమకూరుపల్లె గ్రామానికి చెందిన సాంబశివారెడ్డి అనే రైతు ఇంటి వద్ద నుంచి ఉదయాన్నే ఎద్దుల బండితో సేద్యం చేసేందుకు బయలు దేరి వెళ్లాడు. వ్యవసాయ పొలంలో సేద్యం చేసి తిరిగి వస్తుండగా సమీపంలో ఉన్న కుంటలో ప్రమాదవశాత్తు పడిపోవడంతో అక్కడికక్కడే జత ఎద్దులు మృతి చెందాయి. కుటుబ పోషణ కోసం దాదాపు రూ.2లక్షలు ఖర్చు చేసి జత ఎద్దులను కొనుగోలు చేశానని, ఎద్దులు చనిపోవడంతో జీవనాధారం కోల్పోయానని కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత రైతును ఆదుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కూలిన ఇల్లు... తప్పిన ప్రమాదం



కొండాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామిరెడ్డిపల్లెలో మంగళవారం వెంకటరెడ్డి అనే రైతుకు చెందిన ఇల్లు కూలింది. ఇటీవల కురిసిన వర్షాలకు నానడంతో ఇల్లు కూలినట్లు బాధితుడు తెలిపారు. అదృష్టవశాత్తు మధ్యాహ్నా సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పిందని తెలిపారు. ప్రభుత్వం పక్కాగృహాన్ని మంజూరు చేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ తీగ తెగి పడి గేదె మృతి

బి.కోడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రెడ్డివారిపల్లెలో మంగళవారం రాత్రి విద్యుత్ వైరు తెగి పడటంతో షాక్‌కు గురై గేదె మృతి చెందింది. దాదాపు రూ.80వేలు చేసే గేదె మృతి చెందిందని బాధిత రైతు నాగిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి వాపో యాడు. విద్యుత్ వైరు తెగి కింద పడిందని గ్రామస్థులు మున్నెల్లిలో ఉన్న సబ్‌స్టేషనుకు సమాచారం అందించినా అక్కడ పనిచేస్తున్న సిబ్బంది పొంతనలేని సమాధానం ఇస్తూ కరెంటు ఆఫ్ చేయలేదని గ్రామస్థులు ఆరోపించారు.

ఏడుగురు జూదరులు అరెస్టు

పులివెందుల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలం అంబకపల్లెలో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్టు చేసి రూ.5వేలకు పైగా నగదు స్వాధీనం చేసుకున్నామని రూర్ సీఐ ఎన్‌వీ రమణ తెలిపారు. మంగళవారం రాత్రి పులివెందుల రూరల్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో డీఎస్పీ మురళీనాయక్ సూచనలతో రూరల్ పరిధిలో ఉన్న గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రత్యేక టీములు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ ఈ దాడులు చేశామన్నారు.

బ్రహ్మోత్సవాల్లో పల్లకీ సేవ



కలికిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి పల్లకి సేవను వైభ వంగా నిర్వహించారు. ఉదయాత్పూర్వం ఆలయంలో ధ్వజారోహణ చేశారు. ప్రత్యేక అలంకారాలు, అభిషేకాల అనంతరం స్వామి వారిని దర్శనం కోసం సిద్ధం చేశారు. కార్యక్రమాల్లో పలువురు అర్చకులు పాల్గొన్నారు.

పొలంలో బయటపడ్డ వినాయక విగ్రహం

పెండ్లిమర్రి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తన వ్యవసాయ పొలంలో మంగళవారం ట్రాక్టర్‌తో ఓ రైతు సేద్యం చేస్తుండగా వినాయక విగ్రహం బయటపడింది.

కొత్తగిరియంపల్లెకు చెందిన నడిపి సుబ్బా రెడ్డి వెల్లటూరు పొలంలోని బేతాళ ఆంజనేయస్వామి గుడికి దగ్గ రలోని తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో సేద్యం చేస్తుండగా వినా యక విగ్రహం బయట పడింది. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెల పగా విగ్రహాన్ని బయటకు తీసి పూజలు నిర్వహించారు.

విద్యుత్‌ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలి



వార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ ఆంజనేయులు

మదనపల్లె టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో విద్యుత్ స్తంభం ఎక్కిన జేఎల్ఎం బాలకృష్ణ విద్యుదాఘాతానికి గురై కిందపడి గాయపడ్డారని, దీనిపై సమగ్ర విచారణ చేయించాలని సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయం వద్ద సీపీఐ నాయకుడు సాంబశివ ఆధ్వర్యంలో ఎనర్జీ అసిస్టెంట్లు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ జేఎల్ఎంలు 33 కేవీ, 11 కేవీ విద్యుత్ స్తంభాలు ఎక్కడకూడదని నిబంధనలు ఉన్నా, కొంత మంది బాలకృష్ణను బలవంతంగా విద్యుత్ స్తంభం ఎక్కించారన్నారు. బెంగళూరులో చికిత్స పొందుతున్న బాలకృష్ణకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఈ ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎనర్జీ అసిస్టెంట్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, ముక్తియార్, కరుణాకర్, వినోద్, రామ్మోహన, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కరోనా రోగుల కోసం 5 ప్రత్యేక పడకలు

కలికిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఐదు ప్రత్యేక పడకలను సిద్ధం చేయాలని జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ ఆంజనేయులు సూచించారు. ప్రత్యేక పడకల ఏర్పాటులో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆక్సిజన్ సిలిండర్ల నిల్వలు, అందుబాటులో ఉంచాల్సిన మందులు, ప్రొటోకాల్ విధానాలను వివరించారు. మంగళవారం ఆయన స్థానిక సీహెచ్‌సీని సందర్శించి ఓపీ, డెలివరీలు, ఈహెచ్ఆర్, ల్యాబ్, ఫార్మసీ, లేబర్ రూములు, ఆపరేషన్ థియేటర్‌లను పరిశీలించారు. ఆసుపత్రిలో డెలివరీల సంఖ్య పెరగడాన్ని గమనించి వైద్యులను అభినందించారు. ఓపీ సంఖ్య గణనీయంగా పెరగడాన్ని గుర్తించారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు (ఈహెచ్ఆర్), ఎన్టీఆర్ వైద్య సేవల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాము, కుక్క కాటు వంటి అత్యవసర సేవల కోసం అవసరమైన మందులు అందుబాటులో ఉంచినట్లు వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ వివరించారు. గుండెపోటుకు గురైన వారికి విలువైన ఇంజక్షన్లను అందుబాటులో ఉంచామని చెప్పారు. అనంతరం ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారి పవన్‌కుమార్, వైద్యులు ఆశాలత, అన్వేష్, సిమ్రాన్, ఆశ్రిత, ఫార్మసిస్టు మొయినుద్దీన్, రేడియోగ్రాఫర్ వెంకటరమణ, ఇతర నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దతిప్పసముద్రం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైనార్టీలు 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందించే రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ సూచించారు. ముస్లింలు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, పార్సీలకు నాలుగు శ్లాబుల్లో ఈ రుణాలు ఇస్తుందన్నారు. మొదటి శ్లాబ్ కింద కిరాణాషాప్, పాన్‌షాపు, చికెన్, మటన్ షాపు, కూరగాయలు, పండ్ల దుకాణాలకు యూనిట్‌కు రూ. 1లక్ష, రెండవ శ్లాబ్ కింద రూ.3లక్షలు, మూడవ శ్లాబ్ కింద ఒక్కో యూనిట్‌కు రూ.5లక్షలు మంజూరు చేస్తారన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మూడు సెట్ల ఫారాలను అందించాలన్నారు.

పాపాఘ్ని నది తీరవాసుల కల నెరవేరింది

● గండికొవ్వూరు-వెన్నపల్లె మధ్యలో ప్రారంభమైన హైలెవల్ బ్రిడ్జి పనులు

చక్రాయపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికొవ్వూరు-వెన్నపల్లె సమీపాన పాపాఘ్ని నదిపై హైలెవల్ బ్రిడ్జి మంజూరు కావడంతో పాపాఘ్నినది తీరవాసుల కల నెరవేరింది. ఈ కాంట్రాక్టు పనులను సీఎం రమేష్ సోదరుడు సురేష్‌నాయుడు దక్కించుకున్నారు. పీఎంజీఎస్‌వై గ్రాంట్ కింద దాదాపు రూ.28కోట్లు మంజూరైనట్లు తెలిసింది. ఇక్కడ బ్రిడ్జి నిర్మించడంతో రెండు జిల్లాలను కలపడంతో పాటు పాపాఘ్ని నది తీరప్రాంతాలైన రాచుపల్లె, తక్కళ్లపల్లె, నక్కలదిన్నెపల్లె, మల్లప్పగారిపల్లె, సిద్దారెడ్డిగారిపల్లె, గడ్డంవారిపల్లె, కుమార్లకాల్వ, చెరువుకాంపల్లె, అద్దాలమర్రి తీరప్రాంతవాసుల కల నెరవేరింది. ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావా లంటే దాదాపు 15 కిలో మీటర్లు తిరిగి రావాల్సి ఉంది. ఈ బ్రిడ్జి నిర్మించడంతో కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో మండల కేంద్రానికి చేరవచ్చు. అంతేకాకుండా చక్రాయపేట నుంచి తలుపుల, కదిరి, అనంతపురం జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. పాపాఘ్ని తీరప్రాంతవాసులు పండించిన పంటలను మండల కేంద్రానికి, ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఎంతో సులువు కానుంది.

పాపాఘ్ని నదిలో బ్రిడ్జి నిర్మించడానికి యంత్రాలతో పనులు చేస్తున్న దృశ్యం





ఘనంగా బోయకొండ గంగమ్మ జాతర



బోనాలు మోసుకెళ్తున్న మహిళలు

ములకలచెరువు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని బోయకొండ గంగమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలు, జ్యోతులను ఊరేగింపుగా మోసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అమ్మవారికి అభిషేకం, పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వేరుశెనగ సాగులో విత్తనశుద్ధి ముఖ్యం

ములకలచెరువు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వేరుశెనగ సాగులో విత్తన శుద్ధి ఎంతో ముఖ్యమని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం సేద్యపు విభాగ శాస్త్రవేత సోమశేఖర్‌బాబు తెలిపారు. మండలంలోని కదిరినాథుని కోటలో మంగళవారం కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ మంజుల పర్యవేక్షణలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశెనగ, వరిలో నూతన వంగడాలు, సాగు పద్ధతులను వివరించారు. మండల వ్యవసాయాధికారి లీలాకుమారి మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయతీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధి కారిణి నివేదిత, ఉద్యానవణశాఖ అధికారి భీమేష్, ఆర్ఎస్‌కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకునేందుకే సీఎం సహాయ నిధి



కలికిరి: బాధితుడికి చెక్కు అందజేస్తున్న కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆపన్నులను ఆదుకోవడానికి సీఎం సహాయ నిధి అందుబాటులో ఉందని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలు, రోడ్డు ప్రమాదాలు, తీవ్ర అనారోగ్యం బాధితులకు ఈ సహాయం ఎంతో ఉపశమనం కలిగిస్తుంద న్నారు. మంగళవారం నగరిపల్లెలో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన 28 మందికి రూ.30.80 లక్షల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఒక ఏడాదిలో నియోజకవర్గానికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరయిన నిధులు రూ.కోటి దాటిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులకు రూ.2.86లక్షల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, పీలేరు టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, కువైట్ బాబు, బొక్కసం ఆనంద, కువైట్ సయ్యద్‌బాషా, హనీఫ్, డిష్ బ్రదర్స్ పాల్గొన్నారు.

గుర్రంకొండ: మండలంలోని సంగసముద్రం, గుర్రంకొండ గ్రామాలకు చెందిన అనంత్ కుమార్‌కు రూ.1.79 లక్షలు, కృపామణికి రూ.95 వేలు, గుర్రంకొండకు చెందిన శ్రీనివాసులు యాదవ్, ఎల్లుట్లకు చెందిన సాలమ్మకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. జగదీష్, సుంకర శేఖర్, బాబాజాన్, చంద్రబాబు, మస్తాన్‌రెడ్డి, సురేష్‌లు పాల్గొన్నారు.

‘యోగా దివ్య ఔషధం’



యోగా సాధన చేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్, జూన్ 03 (ఆంధ్రజ్యోతి): యోగా సాధన అన్ని రుగ్మతలకు దివ్య ఔషధంగా పని చేస్తుందని యోగా థెరపిస్ట్ డాక్టర్ పీ.వీ.ఎస్. లక్ష్మి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయం, కోటపల్లె మార్గంలోని షీ దివ్యయోగా కార్యాలయంలో యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజూ కొంత సమయం యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరి దైనందిన జీవి తంలో యోగా ఒక భాగం కావాలని సూచించారు. యోగా ప్రాముఖ్యతను గుర్తించి ప్రతి ఒక్కరికీ యోగా పరి చయం చేయాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంద తెలిపారు. పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ ఈవో గురుమోహన్, పట్టణంలోని సచివాలయం 2, 3, 4 కార్యదర్శులు జ్ఞానశేఖర్, శివాజీ, బాబాజాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్: ఆదిత్య కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి యోగా శిక్షకులు చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

‘కలికిరి టమోటా మార్కెట్ యార్డే మా మెట్టినిల్లు!’



రాంబాబు, శ్రీనివాస వర్మను సన్మానిస్తున్న ఏఎంసీ చైర్ పర్సన్ మాలతి

కలికిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కలికిరి మార్కెట్ యార్డు తమకు మెట్టినిల్లులాంటిదని తాజాగా మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన కలికిరికి చెందిన రాంబాబు, శ్రీనివాస వర్మ తెలిపారు. స్థానిక టమోటా మార్కెట్‌లో ఇరవై ఏళ్లుగా కూలీగా పనిచేస్తున్న దళితుడు రాంబాబు, అదే మార్కెట్ నుంచి ఎదిగిన గిరిజనుడు శ్రీనివాస వర్మకు డైరెక్టరు పదవులు లభించడంపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం నేపథ్యంలో వీరిద్దరినీ మార్కెట్ యార్డు కార్యాలయంలో సన్మానించి అభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీకి, నాయకత్వానికి విధేయత, పార్టీ కోసం అంకిత భావంతో కష్టించడంతోనే ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి గుర్తించి పదవులు కట్టబెట్టారని తెలిపారు. ఏఎంసీ చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన మాలతి, మార్కెట్ యార్డు కార్యదర్శి మస్తాన్ మంగళవారం ఇద్దరినీ కార్యాలయానికి ఆహ్వానించి పూల మాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు ఘన సన్మానం

పీలేరు రూరల్: వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోళ్ల కిశోర్ నాయుడును మంగళవారం పీలేరులో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాజీ సభ్యుడు జనార్దన్ గౌడ్ మాట్లాడుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయరాదని కోరారు. అనంతరం శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అల్తాఫ్, నగిరి రమేష్, సురేశ్ రెడ్డి పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

కలికిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు తరచూ తమ భూములకు సంబంధించిన భూసార పరీక్షలు చేయించుకోవాలని కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల సూచించారు. మేడికుర్తి గ్రామంలో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జరిగిన రైతు సదస్సులో ఆమె మాట్లాడారు. విత్తన శుద్ధి, జీవన ఎరువుల వాడకం, వేరుశెనగ, వరి, కంది పంటల రకాలు, సాగు విధానాలను తెలిపారు. పశువైద్యాధికారి డాక్టర్ గిరినాథ్ రెడ్డి,'ఆత్మ' బీటీఎం అమృత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత జన్మదినం సందర్భంగా అన్నదానం

కురబలకోట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ జన్మదినం సందర్భంగా మంగళవారం ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం చేశారు. అంగళ్లు మూడు రోడ్ల కూడలిలో కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి న్యాయం చేస్తానన్నారు. నియోజకవర్గంలో పార్టీని మరింతగా బలోపేతం చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

నిమ్మనపల్లి/పెద్దతిప్పసముద్రం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలో డొక్కా సీతమ్మ మధ్యాన్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతతో పాటు, రుచికరంగా ఉండాలని నిమ్మనపల్లి ఎంఈవో-2, పీటీఎం ఎంఈవో గౌస్‌పీర్ సూచించారు. ఆయా మండల కేంద్రాల్లో మంగళవారం వారు మధ్యాన్న భోజన నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ ఇచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలోనే విద్యార్థులకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గత ఏడాది నాణ్యతగా భోజనం తయారు చేసిన నిర్వాహకులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు చంద్రకళ, మంజుల, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు విద్యా సామగ్రి పంపిణీ

నిమ్మనపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు ఎంఈవో నారాయణ-2 మంగళవారం విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం అయ్యేలోగా విద్యాసామగ్రిని పంపిణీ చేశామన్నారు. మొత్తం 60 పాఠశాలలు వుండగా ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాం, బ్యాగు, నోటు పుస్తకాలు, అచ్చు పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. బూట్లు, బెల్టులు త్వరలోనే వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరపిలు మంజుల, నరసింహులు, సుధాకర తదితరులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన



మలేరియాపై అవగాహన ర్యాలీలో డాక్టర్ రమేష్‌బాబు, తదితరులు

నిమ్మనపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మలేరియా, డెంగీ, బోదకాలు, విషజ్వరాలను అరికట్టాలని వైద్యాధికారి రమేశ్ బాబు పిలుపునిచ్చారు. ఆశాడేను పురస్కరించుకొని మంగళవారం వైద్యసిబ్బంది ముక్త భారత్ అభియాన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లా డుతూ గర్భిణులు బాలింతలు, చిన్నపిల్ల లకు సరైన సమయంలో టీకాలు వేయించడంతోపాటు, టీబీ పరీక్షలు చేయించాలని తెలిపారు. ఆశ కార్యకర్తల సేవలు వైద్యం రంగంలో ఎంతగానో ఉపయోగపడున్నాయని తెలిపారు. అనంతరం టీబీ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేసి, మలేరియాపై ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్‌లు వైద్య సిబ్బందిఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

‘మా భూమి కాజేశారు’

మదనపల్లె అర్బన్, జూన్3(ఆంధ్రజ్యోతి):తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన మరొకరు ఆక్రమించి అమ్మేశారని బాధితుడు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లె మండలం, రెడ్డివారిపల్లె రెడ్డివారిపల్లెలో 1964 నుంచి తమ పూర్వీకుల అనుభంలో ఉన్న మూడు ఎకరాల భూమిపై కొందరు తప్పుడు పాస్‌బక్కులు చేయించి అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. విషయం తెలియడంతో తాను రికార్డులతో కోర్టును ఆశ్రయించానన్నారు. ఆ భూమిలో ఎలాంటి పనులు చేయరాదని కోర్టు నోటీసులు జారీ చేసినా ఆ భూమిలో బోరు వేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి ప్రయత్నించారన్నారు. నిమ్మనపల్లె తహసీల్దార్, ట్రాన్స్‌కో ఏఈలకు కోర్టు నోటీసులు చూపి ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని చెప్పినా, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తాము బోరుకు, విద్యుత్ కనెక్షన్‌కు అనుమతి ఇచ్చినట్లు వారు తెలిపారని వివరించారు. ఉన్నత అధికారులు విచారించి న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

రౌద్రాల అంకాలమ్మకు పూజలు

పీలేరు రూరల్, జూన్ 03 (ఆంధ్రజ్యోతి): జ్యేష్ఠమాసం మంగళవారం సందర్భంగా గ్రామదేవత రౌద్రాల అంకాలమ్మవారిని అలంకరించారు. ఉదయం పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. పలువురు మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏటా అమ్మవారికి ఐదు వారాలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. జూన్ 10వ తేదీన మంగళవారం ఉదయం 108 కలశాలతో అభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు పట్టణ వీధులలో రథోత్సవం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రవీంద్రరాజు, అర్చకులు భరత్ స్వామి, అంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

గంగజాతరకు తిరుపతి గంగమ్మ ముస్తాబు

నిమ్మనపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం పంచాయతీలో నిర్వహించనున్న గంగ జాతరకు బోయకొండ గంగమ్మ, నలవీర గంగమ్మ, నడివీధి గంగమ్మ, తిరుపతి గంగమ్మ మంగళవారం ముస్తాబయ్యారు. ఈ సందర్భంగా కోలాటాలు, బాజా భజంత్రీల మధ్య మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

మదనపల్లె, జూన్3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇండస్ట్రి యల్ ఎస్టేట్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బహుజన యువ సేన అధ్యక్షుడు పునీత్‌కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనే జర్ మూర్తికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరా రు. పట్టణంలోని పారిశ్రామిక అభివృద్ధికోసం 36 ఎకరాల్లో పారిశ్రామిక వేత్తలకు ప్లాట్లు కేటాయిస్తే, వాటిని ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న యువత, కూలీలకు ఉపాధి కల్పించడానికి చౌక దరతో ప్లాట్లు కేటాయించగా, ఆయా యజమానులు కొందరు ఎలాంటి అనుమతులు, కన్వర్షన్ లేకుండా పెద్దపెద్ద భవంతులు నిర్మిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. వీరికి భారీ స్థాయిలో రాయితీలు, రుణాలు ఇస్తే, వాటిని తుంగలో తొక్కి పెద్ద మొతా_్తలకు విక్రయించడంతోపాటు ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. సెల్లార్‌తోపాటు బహుళ అంతస్థులు నిర్మిస్తున్నారని, వాటికి వేరే కేటగిరిలో ఇచ్చిన విద్యుత్తు కనెక్షన్లు కూడా తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. అందుకు సంబంధించిన సమాచారాన్ని సమాచారహక్కు చట్టం-2005 ప్రకారం అడిగినా అధికారులు వివరాలు ఇవ్వడం లేదని వాపోయారు. పైగా తాము అడిగిన సమాచారాన్ని క్షణాల్లో భవన యజమానులకు చేరవేస్తూ, అక్రమా ర్కులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధి కారులు స్పందించి అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన చేపడతామని పునీత్‌కుమార్ పేర్కొన్నారు.

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మదనపల్లె విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె అర్బన్, జూన్3 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ప్రశాంత నగర్‌లోని శ్రీ చైతన్య స్కూల్ పూర్వ విద్యార్థి ఎం.ఎ మహమ్మద్ ముదసిర్ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 412 ర్యాంకు సాధించాడని ఆ స్కూల్ ఆర్ఐ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి జోన్ ఏజీఎం, ఆర్ శ్రీధర్ విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ పరీక్షల్లో విద్యార్థులు శ్రమించి ర్యాంకులు సాధించడం తల్లిదండ్రలకు గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు ఫ్యారేజాన్, మోహతాజ్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, మహమ్మద్‌రఫీ, డీన్ మహమ్మద్ నూర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన మొరంపల్లె సహదేవరెడ్డి, రజినీల కుమారుడు మొరంపల్లె వేదహర్షిత్‌రెడ్డి ఆల్‌ఇండియా లెవల్‌లో ఓపెన్ కేటగిరిలో 2628 ర్యాంకు, ఈడబ్ల్యూసీ కేటగిరిలో 244 ర్యాంకును సాధించారు. తల్లిదండ్రులు మదనపల్లె బ్రిలియంట్ స్కూల్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడుతూ ఒక ప్రణాళిక ప్రకారం చదివితే అత్యుత్తమ ర్యాంకు సాధించవచ్చని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థిని బ్రిలియంట్ స్కూల్ ఉపాధ్యాయులు, నారాయణ కళాశాల అధ్యాపకులు అభినందించారు.

హార్సిలీహిల్స్‌లో ఇంజనీరింగ్ విద్యార్థుల శ్రమదానం



శ్రమదానం చేసిన ఇంజనీరింగ్ విద్యార్థులు

బి.కొత్తకోట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడపజిల్లా కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ సుధ ఆధ్వర్యంలో కడపకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు గాలిబండ, జిడ్డుకృష్ణ మూర్తి సర్కిల్, హరిత సర్కిల్ తదితర ప్రాంతా లలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ ఈ నెల 5న అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు శ్రమదానం చేశారన్నారు. ఎంపీడీవో కృష్ణవేణి పాల్గొన్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే దుష్ప్రచారం

● మున్సిపల్ కౌన్సిలర్ ముబషీరా

మదనపల్లె టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాజకీయ దురుద్దేశంతోనే తనపై కొందరు రాజకీయ నాయకులు దుష్ప్రచారం చేశారని వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్ ముబషీరా ఆరోపించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ మనూజ చాంబర్‌లో వైసీపీ కౌన్సిలర్లు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ మాట్లాడుతూ 31వ తేదీన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు తప్ప ఇతరులు పాల్గొనలేదన్నారు. సమావేశంలో పాల్గొన్న వారే రిజిస్టర్‌లో సంతకాలు చేశారన్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జి.షమీం అస్లాం మాట్లాడుతూ పత్రికల్లో వచ్చిన కథనాల్లో వాస్తవం లేదన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సీసీ కెమెరాలు వున్నాయని, ఎవరికైనా అనుమానం ఉంటే వచ్చి చూసుకోవచ్చన్నారు. కౌన్సిలర్ ముబషీరా బుర్ఖా ధరిస్తుందని, ఆమెను కౌన్సిల్ సమావేశానికి తానే పిలుచుకొచ్చానన్నారు. రాజకీయంగా తమపై బురదచల్లాలనే దురుద్దేశంతోనే కొంత మంది ఇలా చేశారన్నారు. కౌన్సిలర్‌గా, వైస్‌చైర్మన్‌గా, చైర్మన్‌గా ఉన్నపుడు పోరాడి గెలుపొందానని కొంత మందిలా కుటుంబ పాలన చేయనన్నారు. హరి ఇచ్చిన ఫిర్యాదులో వాస్తవాలు లేవన్నారు. ఎవరో బెదిరిస్తే తమ కౌన్సిలర్ బురఖా తీయదన్నారు. కౌన్సిలర్ ముబషిరా మాట్లాడుతూ, తాను శనివారం కౌన్సిల్ సమావేశానికి వచ్చి, సంతకాలు పెట్టానన్నారు. తానే సమావేశానికి వస్తూ సంతకాలు చేస్తున్నానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు ఫర్జానా, షబానా, షర్మిలభాను, ముబీనా, బీఏ ఖాజా, నూర్‌ఆజమ్ తదితరులు పాల్గొన్నారు.